

నీరు-చెట్టు బిల్లులకు బ్రేక్!

సీఎఫ్ఎంఎస్ ఆగిపోవడంతో అప్‌లోడ్ కాని బిల్లులు

- వివరాలు 6లో..



సప్తసప్త మహాసప్త!!

- ఏడు వాహనాలపై విహరించిన వైకుంఠనాథుడు
- పెంచలకోనకు పోటెత్తిన భక్తజనం
- నగరంలో రంగనాథుడి వైభోగం

రాపూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మాఘ శుద్ధ సప్తమి రోజున జగతికి వెలుగులు పంచే దినకరుడి పండుగ రథసప్తమి పర్వదినాన్ని పెంచలకోన క్షేత్రంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఒకేరోజు పెంచలోరు ఏడు వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 6 గంటలకు సూర్యుడి నులివెచ్చని కిరణాల స్పర్శతో ప్రారంభమైన వాహన సేవలు రాత్రి 8 గంటలకు చల్లని చందమామ వెలుగులతో ఉత్సవాలు ముగిశాయి. ఉదయం సూర్యప్రభ వాహనంపై తొలుత దర్శనం ఇచ్చిన లక్ష్మీనృసింహుడు ఆ తర్వాత 8 గంటలకు శేష వాహనం, 10 గంటలకు సింహ వాహనం, మధ్యాహ్నం 12 గంటలకు స్వర్ణ గరుడుడిపై కొలువుదీరి భక్తులను కటాక్షించారు. ఆ తర్వాత సాయంత్రం 4 గంటలకు హనుమంత సేవ, 6 గంటలకు అశ్వవాహనాలపై స్వామివారు కొలువుదీరి మాడవీధుల్లో ఊరేగారు. మధ్యాహ్నం వాహన సేవల్లో అలసిపోయిన స్వామివారిని చక్రస్నానంతో సేదతీరారు. ఒకేరోజు పెంచులోరు ఏడు వాహనాలపై కనువిందు చేయడంతో ఆలయానికి భక్తులు పోటెత్తారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటం యాత్రికులను ఆకట్టుకుంది. భక్తులకు ఎలాంటి ఇబ్బం దులు లేకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.



సూర్యప్రభ వాహనంపై కొలువుదీరిన లక్ష్మీనృసింహుడు

పెంచలకోనలో సింహవాహనంపై ఊరేగుతున్న నృసింహ స్వామి



శేష వాహనంపై...



స్వర్ణ గరుడుడిపై..



హనుమంతుడిపై..

- వైభవంగా రథోత్సవం



అశ్వవాహనంపై ఊరేగుతూ..



నెల్లూరులో సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న రంగనాథుడు



కోనలో చల్లని చంద్రుడిపై కొలువుదీరి..



కోనేరులో చక్రస్నాన ఘట్టం



చుండి అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్డు బరువును పరిశీలిస్తున్న విజయ భాస్కర్‌రెడ్డి

గుడ్డు సైజు తగ్గిందేంటి!? ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా!?

- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ ఆరా

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌భాస్కర్‌రెడ్డి వలేటివారిపాళెం మండలంలో మంగళవారం విస్తృతంగా పర్యటించారు. మాలకొండ, అయ్యవారిపల్లె, చుండి, వలేటివారిపాలెం, పోకూరు, చెర్లోపాలెం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, రేషన్ ఎండీయూ వాహనాలను ఆయన తనిఖీలు చేశారు. చుండి అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్ల సైజు, బరువు తేడా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గుడ్డు 45 నుంచి 55 గ్రాములలోపు బరువు ఉండాలని, అధికారుల ద్వారా కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి 50 గ్రాముల బరువు కలిగిన గుడ్లను సరఫరా చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందుతున్న పౌష్టికాహారంపై గర్భవతులు, బాలింతలు, పిల్లలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానమంత్రి మాతృశ్రీ పథకం కింద గర్భవతులకు మూడు విడతలుగా రూ.5 వేలు అందజేస్తోందని, అలాగే ఆడపిల్ల పుడితే రూ.6 వేలు ఇస్తోందని ఇవన్నీ అందుతున్నాయా అని గర్భవతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంటశాలలను పరిశీలించి భోజనం రుచి చూశారు. ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సక్రమంగా అందుతోందా అని కార్డుదారులను అడిగి తెలుసుకున్నారు. చైర్మన్ వెంట డ్వామా పీడీ గంగాభవాని, డీఎస్ఓ అంకయ్య ఏసీడీపీఓ అనూరాధ, డిప్యూటీ డీఈఓ జానకీరామ్, సీడీపీఓ శర్మిష్ఠ తదితరులు పాల్గొన్నారు.

- నెల్లూరు (హరనాథపురం) : నగరంలోని బీసీ బాలికల హాస్టల్‌ను విజయప్రతాప్‌రెడ్డి మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట తయారీని పరిశీలించిన ఆయన, వంట ఎలా ఉందని, మెనూ అమలవుతోందా అంటూ విద్యార్థులతో మాట్లాడారు.

'హౌసింగ్' స్కాం..

రూ.110 కోట్లు

- పేదల ఇళ్ల మాటున భారీగా అక్రమాలు
- విచారణ పూర్తి చేసిన విజిలెన్స్ అధికారులు
- ఏఈల నుంచి పీడీల వరకూ బాధ్యులుగా గుర్తింపు

కూటమి ప్రభుత్వానికి చేరిన నివేదిక

వైసీపీ హయాంలో పేదల ఇళ్ల మాటున జరిగిన దోపిడీ లెక్క తేలింది. క్షేత్రస్థాయిలో విచారణ జరిపిన విజిలెన్స్ అధికారులు అక్రమాలను నిగ్గు తేల్చారు. రాష్ట్రంలోనే అత్యధికంగా నెల్లూరు జిల్లాలో సుమారు రూ.110 కోట్ల ప్రజాధనం దుర్వినియోగమైనట్లు నిర్ధారించారు. ఇందులో గృహనిర్మాణ శాఖ అధికారులు కీలకంగా వ్యవహరించినట్లు గుర్తించారు. బాధ్యులుగా ఏఈ స్థాయి నుంచి పీడీ స్థాయి అధికారుల వరకూ చేరుస్తూ తయారు చేసిన నివేదికను ప్రభుత్వానికి పంపారు. ఈ నివేదిక ఇప్పుడు ప్రభుత్వ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం తదుపరి ఎటువంటి చర్యలు తీసుకుంటుందన్నదానిపై హౌసింగ్ శాఖలో టెన్షన్ నెలకొంది.

నెల్లూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వంలో పేదలందరికీ ఇళ్లు పేరుతో చేపట్టిన గృహ నిర్మాణ పథకంలో భారీగా అక్రమాలు జరిగాయి. ఆప్షన్-3 కింద లబ్ధిదారులకు కాంట్రాక్టర్లే ఇళ్లు నిర్మించి ఇచ్చేలా జిల్లాలో వేల ఇళ్లను వారికి అప్పగించారు. ఈ అప్పగింతలో ఒక పద్ధతి అంటూ లేకుండా వ్యవహరించారు. ఎటువంటి అనుభవం, గ్యారెంటీలు లేకుండా ఇష్టమొచ్చిన రీతిలో వారికి నచ్చిన వారికి నచ్చినన్ని ఇళ్లను హౌసింగ్ అధికారులు అప్పగించారు. ఆ కాంట్రాక్టర్లు ఇళ్లు నిర్మించకపోయినా వారికి సిమెంటు, స్టీలు, ఇసుక వంటి మెటీరియల్ సరఫరా చేయడమే గాక ఏకంగా బిల్లులు కూడా చెల్లించేశారు. ఉన్నతాధికారులకు మాత్రం ఇళ్లు నిర్మించినట్లు ప్రోగ్రెస్ రిపోర్టులు వస్తుండగా, క్షేత్రస్థాయిలో మాత్రం ఇళ్లు కనిపించడం లేదంటే నాడు దోపిడీ ఏ స్థాయిలో జరిగిందో అర్థం చేసుకోవచ్చు.


- ప్రభుత్వ ఆదేశాలతో

ఈ వ్యవహారంపై కూటమి ప్రభుత్వానికి ఫిర్యాదులు అందడంతో విచారణకు ఆదేశించింది. రంగంలోకి దిగిన విజిలెన్స్ విభాగం.. జిల్లాలోని అన్ని లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణ పురోగతిని పరిశీలించింది. అదే సమయంలో చెల్లించిన బిల్లులను సరిపోల్చింది. ఈ క్రమంలో భారీ అవినీతి వెలుగుచూసింది. నిర్మించిన ఇళ్ల స్థితికి, చెల్లించిన బిల్లులకు పొంతన లేదని గుర్తించి, అది ఎంత స్థాయిలో ఉందన్నది లెక్కలు వేసింది. ఈ నేపథ్యంలోనే సుమారు రూ.110 కోట్ల వరకూ ప్రజాధనం దుర్వినియోగమైనట్లు విజిలెన్స్ అధికారులు నిర్ధారణకు వచ్చారు. ముందుగా తాము గుర్తించిన తేడాలకు సమాధానం చెప్పాలంటూ హౌసింగ్ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు నోటీసులు ఇచ్చారు. వారంతా వివరణ ఇచ్చారు. ఆ వివరణలను పరిగణలోకి తీసుకొని ఎవరెవరు ఈ అక్రమాలకు బాధ్యులన్నది నిర్ధారించారు. అప్పట్లో జిల్లాలో పనిచేసిన అతికొద్దిమంది మినహాయిస్తే మిగిలిన వారంతా ఈ అక్రమాలకు బాధ్యులని విజిలెన్స్ అధికారులు తేల్చినట్లు సమాచారం. ఈ నివేదికను చూ సిన ఓ జిల్లా ఉన్నతాధికారి ఆశ్చర్యపో యినట్లు తెలిసింది. విచారణ పూర్తి నివే దికను తయారు చేసిన విజిలెన్స్ అధికారు లు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు.

- ఇప్పుడూ వారే..!

ప్రభుత్వం మారింది.. విధానాలు మారాయి.. మరో వైపు గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలు ఒక్కొక్కటిగా నిగ్గు తేలుతున్నాయి.. కానీ జిల్లాలో పనిచేస్తున్న హౌసింగ్ అధికారులు మాత్రం మారడం లేదు. గత ప్రభుత్వంలో ఎవరైతే జిల్లాలో కీలకంగా వ్యవహరించి నాటి అక్రమాలకు సూత్రధారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్నారో.. వారే ఇప్పుడూ అక్కడ కీలకంగా వ్యవహరిస్తుండడం గమనార్హం. ఇటీవల జరిగిన బదిలీల్లో అన్ని శాఖల్లో స్థానచలనాలు జరిగాయి. కానీ హౌసింగ్ శాఖలో మాత్రం ఒకరిద్దరు మినహాయిస్తే మిగిలిన వారంతా జిల్లాలోనే సర్దుకున్నారు. పేదల ఇళ్ల సొమ్ముతో పడుగుపాడు వద్ద మూడంతస్థుల భవనం నిర్మించుకున్నారన్న ఆరోపణలు ఉన్న అధికారే ఇప్పుడు నెల్లూరులో కీలక స్థానంలో పనిచేస్తున్నారు. గతంలో కావలిలో పనిచేసిన ఓ అధికారి పక్క జిల్లాకు బదిలీ అయినట్లే అయి మళ్లీ జిల్లాకు వచ్చేశారు. ఓ ఈఈ, డీఈలు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారందరినీ సిండికేట్ చేసి ఎలాగైనా విజిలెన్స్ విచారణ నుంచి తప్పించుకోవాలని అనేక మార్గాల్లో లాబీయింగ్ చేస్తున్నట్లు హౌసింగ్ శాఖలో ప్రచారం నడుస్తోంది. మరోవైపు కట్టిన ఇళ్ల నాణ్యతపై విచారణ జరిగితే ఇంకెన్ని రూ.కోట్లు కుంభకోణం బయటపడుతుందోనన్న ప్రచారం జరుగుతోంది.

కందుకూరుకు 15న సీఎం రాక?



కందుకూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 15వ తేదీన కందుకూరుకు రానున్నారు. ఆ రోజు కందుకూరులో జరిగే స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సీఎం పాల్గొననున్నారని మంగళవారం అధికారులకు సమాచారం అందింది. అలాగే పలు అభివృద్ధి పనులకూ చంద్రబాబు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అయితే, రెండు మూడురోజుల్లో సీఎం పాల్గొనే కార్యక్రమ వివరాలపై స్పష్టత వస్తుందని తెలిపారు.

300 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

- రైతులకు ఇబ్బందులు రానీయకుండా ఏర్పాట్లు
- సమస్య పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబర్
- మిల్లర్ల సమావేశంలో జేసీ కార్తీక్

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా 300 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ కార్తీక్ చెప్పారు. మంగళవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాలులో ఆయన మిల్లర్లతో జాయింట్ కలెక్టర్ సమావేశమై మాట్లాడారు. గత ఖరీఫ్ సీజన్‌లో వేసిన పంటకు ఈ నెల రెండో వారం నుంచి ధాన్యం కొనుగోలు చేయడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 523 రైతు సేవా కేంద్రాలకు అనుసంధానంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రతి విషయంలోనూ రైతులకు ఇబ్బంది లేకుండా గోతాలు, హమాలీలు, రవాణా సదుపాయాలు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఒకవేళ రైతులే సమకూర్చుకుంటే అందుకు సంబంధించి నగదును చెల్లించనున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి పౌరసరఫరాల సంస్థ కార్యాలయంలో 8520879979 నెంబరుతో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని తెలిపారు. రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే ఆ నెంబరుకు ఫోన్ చేయాలని కోరారు. ఈ సమావేశంలో సివిల్ సప్లయిస్ డీఎం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సెలవుల్లోనూ మధ్యాహ్న భోజనం

- టెన్త్ విద్యార్థులకు ప్రత్యేకం
- పరీక్షల ప్రారంభం వరకు అమలు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సెలవు రోజుల్లో కూడా మధ్యాహ్న భోజ న పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పరీక్ష ల సమయంలో ప్రత్యేకంగా తరగతుల నిర్వహణ నేపథ్యంలో విద్యార్థులు దూర ప్రాంతాల్లో ఉన్న తమ ఇంటికి భోజనానికి వెళ్లి తిరిగి రావడం కష్టతరంగా మారుతుందని ప్రభుత్వం గుర్తించింది. దీంతో సెలవుల్లో కూడా టెన్త్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేయా లని ఆదేశించింది. ఈ మేరకు జిల్లా అధికారులు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ నిర్ణయం విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని, ఉత్తమ ఫలితాల సాధన కు అవకాశం లభిస్తుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం పలువురు విద్యార్థులు సెలవు రోజున భోజనానికి ఇంటికి వెళ్లి తిరిగి రావ డం లేదని, ఇకపై ఆ సమస్య ఉండబోదని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

- 25వేల మందికి ప్రయోజనం

సెలవు రోజుల్లో మధ్యాహ్న భోజనం వల్ల జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 25వేల మందికిపైగా టెన్త్ విద్యార్థులకు ప్రయోజనం కలుగనుంది. ఈ కార్యక్రమాన్ని పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యే మార్చి 17వతేదీ వరకు కొనసాగించనున్నారు. అప్పటి వరకు మొత్తం 11 సెలవులు వస్తుండగా వీటిలో 7 ఆదివారాలు, రెండు రెండో శనివారాలు, ఈ నెల 26 మహా శివరాత్రి, మార్చి 14న హోలీ పండుగ ఉన్నాయి.

ఉత్తమ ఫలితాలకు అవకాశం

ప్రభుత్వ నిర్ణయంతో టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధిం చేందుకు మరింత అవకాశం లభించింది. ఇప్పటికే విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి తరగతులు నిర్వహిస్తుండగా, సెలవు రోజుల్లో సైతం నిర్వహిస్తున్న తరగతులకు మధ్యాహ్న భోజనం అందుబాటులోకి వచ్చింది. జిల్లాలోని హెచ్‌ఎంలు, ఎంఈవోలు, డిప్యూటీ ఈవోలు కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించాము.

- డాక్టర్ ఆర్ బాలాజీరావు, డీఈవో





మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

18 ఆలయాల పునఃనిర్మాణానికి

రూ.38 కోట్ల మంజూరు

- శివరాత్రికి ఆలయాల్లో విస్తృత ఏర్పాట్లు
- మంత్రి ఆనం వెల్లడి

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 18 ప్రసిద్ధ ఆలయాల పునఃనిర్మాణానికి రూ.38 కోట్లు మంజూరయ్యాయని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం రథసప్తమి సందర్భంగా మూలస్థానేశ్వరాలయంలోని సూర్య భగవాన్ ఆలయంలో అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మూలస్థానేశ్వరుడిని, భువనేశ్వరీ అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మంత్రి ఆనం మాట్లాడుతూ రాబోయే శివరాత్రికి భక్తులు ఇబ్బంది పడకుండా విస్తృత ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. మూలాపేట శివాలయానికి తమ కుటుంబానికి ప్రత్యేక అనుబంధం ఉందని, రథసప్తమికి తమ కుటుంబమే ఉభయకర్తలుగా వ్యవహరిస్తోందన్నారు. నగర ఎమ్మెల్యే, మంత్రి పొంగూరు నారాయణతో చర్చించి మూలస్థానేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కోవూరు జనార్ధన్‌రెడ్డి, ఆలయ ఈవో శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యాలకు వేళాయే!

- జూన్ వరకు పెళ్లిళ్లు
- కళకళలాడనున్న మార్కెట్

మాఘమాసం వచ్చేసింది. సుమూహార్తాల మూటను మోసుకొచ్చేసింది. నిశ్చితార్థమయిన వారి ఇంట పెళ్లి సందడి తెచ్చేసింది. ఉత్తరాయణ పుణ్యకాలంలో వచ్చే ఈమాసానికి ఎంతో ప్రాధాన్యముందని ప్రగాఢంగా ప్రజలు విశ్వసిస్తారు. అందుకే మాఘమాసం వివాహాది శుభకార్యాలకు పెట్టింది పేరు. పెళ్లిళ్లు, అక్షరా భ్యాసాలు, నామకరణాలు లాంటివి ఈ రోజుల్లోనే చేసేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తుంటారు. పెళ్లిళ్లయితే అన్నీ ఇన్నీ కాదు. ఈ సారి కూడా జిల్లావ్యాప్తంగా పెళ్లిళ్ల సంఖ్య గణనీయంగానే ఉంది. ముందుగానే కల్యాణమండపాలు బుక్కయిపోయాయి. పేరున్న పురోహితులంతా బిజీబిజీనే. కేటరింగ్ నుంచి బాజాభజంత్రీల వారివరకూ అందరూ ఒప్పందాలు కుదుర్చేసుకున్నారు. నాలుగేళ్ల తర్వాత వరుస నెలల్లో శుభ కార్యాలు జరపుకొనేందుకు అవకాశం వచ్చిందంటున్నారు. ఈ క్రమంలో మాఘ మాసంలో పెళ్లిళ్లకు హడావుడి మొదలైపోయింది.



- వివరాలు 6లో..

బిలకూట క్షేత్రంలో ప్రసన్నుడి విహారం



కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలో మంగళవారం రథసప్తమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. వైకానస ఆగమన శాస్త్రప్రకారం ఆలయ అర్చకులు సత్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారిని ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనాలపై ఆలయ ప్రదక్షిణ చేపట్టారు. గ్రీన్‌సిటీ ఆఫ్ హైదరాబాద్ కంపెనీ నిర్వాహకులు కొండ్రాజు సుబ్బరాజు, వెంకటరమణమ్మ దంపతులు సూర్యప్రభ ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా కోగంటి వేణుగోపాల కృష్ణమా చార్యులు ఆదిత్య హృదయమ్ ప్రవచనం భక్తులకు వినిపించారు. రాత్రి జరిగిన చంద్రప్రభ వాహన ఉత్సవ ఉభయకర్తలుగా కావలి చేరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి పద్మావతి దంపతులు వ్యవహరించారు. ఉత్సవాల్లో కోలాటం, భజన, నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

- బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి)



వేదగిరిపై రథసప్తమి వేడుకలు

రథసప్తమి పర్వదినం సందర్భంగా వేదగిరి క్షేత్రంలో మంగళవారం సప్తవాహన సేవలు నిర్వహించారు. ముందుగా విశేష అభిషేకాలు, పూజలు జరిగాయి. అనంతరం ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేతంగా నరసింహ స్వామి సూర్యప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. తదుపరి శేష వాహనం, హనుమంత, గరుడ, సింహ, హంస వాహనాలపై శ్రీవారి ఊరేగారు. చివరిగా రాత్రి చంద్రప్రభ వాహనంపై భక్తుల పూజలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక కోనేరులో స్వామి వారి చక్రస్నానం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈవో గోపి, ఆలయ ప్రధాన అర్చకుడు భాస్కరాచార్యులు, ఉభయకర్తలు పర్యవేక్షించారు.

- నెల్లూరు రూరల్, (ఆంధ్రజ్యోతి)



హంస వాహనంపై ఊరేగుతునన రంగనాథుడు



సింహ వాహనంపై...



పెద్ద శేషవాహనసేవంపై



చల్లని చంద్రుడిపై చక్కని రంగడు

సప్త వాహనాల్లో రంగడి వైభోగం

- వైభవంగా రథసప్తమి

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : రథసప్తమి పర్వదినం సందర్భంగా మంగళవారం నెల్లూరులోని తల్పగిరి రంగనాథ స్వామి ఏడు వాహనాలపై భక్తులకు కనువిందు చేశారు. ఉదయం సూర్య ప్రభ వాహనంపై శ్రీవారు కాంతులీనారు. అనంతరం స్వర్ణ గరుడ, సింహ, హంస, బంగారు తిరుచ్చి, పెద్ద శేషవాహనం, రాత్రి చంద్ర ప్రభ వాహనంపై తల్పగిరీశుడు దర్శనమిచ్చారు. విశేష పూజలు, తిరుమంజన సేవలు జరిగాయి. గోవింద.. రంగనాథ నామ స్మరణతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. పెంచలకోన, వేదగిరిలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయాల్లోనూ సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు సప్తవాహన సేవలు జరిగాయి. వేలాది మంది భక్తులు తరలివచ్చి శ్రీమన్నారాయణుని దర్శించుకున్నారు. జిల్లాలోని వైష్ణవాలయాలు, మూలస్థానేశ్వరాలయంలో రథసప్తమి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి.



బంగారు తిరుచ్చి



సత్కారం పొందిన విశ్రాంత పోలీసులతో ఎస్పీ కృష్ణకాంత్, ఏఎస్పీ సౌజన్య, డీఎస్పీ సింధుప్రియ, అధికారులు

పోలీసులకు ఆత్మీయ వీడ్కోలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో సుదీర్ఘకాలం సేవలందించి ఉద్యోగ విరమణ చేస్తున్న అధికారులకు మంగళవారం ఎస్పీ జీ కృష్ణకాంత్ ఆత్మీయ వీడ్కోలు పలికారు. నగరంలోని ఉమేష్‌చంద్ర సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం జరిగింది. కావలి 1వ టౌను పోలీసు స్టేషన్‌లో పని చేసిన ఎస్‌ఐ ఎం అంబేడ్కర్, పీసీఆర్‌లో పనిచేసిన ఏఎస్‌ఐ సీహెచ్ వీ కృష్ణయ్య, బిట్రగుంటలో విధులు నిర్వహించే ఏఎస్‌ఐ సీహెచ్ సుధాకర్‌రెడ్డి, దగదర్తిలో విధులు నిర్వహించే ఏఎస్‌ఐ టీ మోహన్‌రావు, గూడూరు 1వ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహించే హోమ్‌గార్డు కే శ్రీని వాసులును ఎస్పీ సత్కరించారు. శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని, ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఎటువంటి అవసరమైనా తనను సంప్రదించాలని, అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, నగర డీఎస్పీ సింధుప్రియ, ఎస్ బీ డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్‌బీ సీఐలు వెంకటేశ్వరరావు, శ్రీనివాస రెడ్డి, ఆర్‌ఐలు రాజా రావు, పౌల్‌రాజు, హరిబాబు, పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

20 సీసాల మద్యం స్వాధీనం

నెల్లూరు రూరల్, (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా రవాణా చేస్తున్న మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు నెల్లూరు రూరల్ ఎక్సైజ్ సీఐ ప్రసన్న లక్ష్మి మంగళవారం తెలిపారు. వెంకటాచలం మండలం ఇడిమేపల్లి క్రాస్‌రోడ్డు వద్ద 180 ఎంఎల్ 20 బాటిళ్లను తీసుకెళ్తున్న ఉప్పు చెత్తమ్మను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఆమెపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ ఆకస్మిక దాడుల్లో ఎస్‌ఐలు శకుంతలాదేవి, మనీర్ అహ్మద్ పాల్గొన్నట్లు తెలిపారు.

మధ్యతరగతి కుటుంబంలో పుట్టి.... తల్లిదండ్రుల సహకారంతో 'పిట్ట కొంచెం -కూత ఘనం' అన్నట్లుగా ఐదేళ్ల వయసు నుంచే స్కేటింగ్‌లో సాధన మొదలు పెట్టాడు. కుందూరు నాగదర్శన్(6). తండ్రి రాజేష్‌కు స్కేటింగ్‌పై ఉన్న మక్కువ తో ఆయనతోపాటు రింక్‌కు వెళ్లేవాడు. స్కేటింగ్‌లో తనకు కూడా శిక్షణ ఇప్పిం చాలని తండ్రిని కోరగా, వెంటనే ఆ క్రీడలో ఓనమాలకు శ్రీకారం చుట్టారాయన. చిన్న వయసు నుంచే క్రీడాసాధన చేస్తూ సీనియర్లను సైతం ఆకట్టుకోవడంతో జిల్లా స్కేటింగ్ అసోసియేషన్ నిర్వాహకులు ఆ బాలుడిని మరింత ప్రోత్సహిం చారు. దీంతో ఆ క్రీడలో మంచి పట్టు సాధించాడు. ప్రస్తుతం రాష్ట్ర, జాతీయ పోటీల్లో పతకాలు సాధించి ఉత్తమ క్రీడాకారుడిగా అవార్డు అందుకున్నాడు. ఈ క్రమంలో నాగదర్శన్‌పై ఆంధ్రజ్యోతి అందిస్తున్న ప్రత్యేక కథనం.

- నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి)



- ఐదేళ్ల వయసు నుంచే శిక్షణ
- జాతీయస్థాయిలో పతకాలు
- ఉత్తమ క్రీడాకారుడిగా అవార్డులు

స్కేటింగ్‌లో మేటి నాగదర్శన్

టాలెంట్



కలెక్టర్ ఆనంద్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న క్రీడాకారుడు నాగదర్శన్

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే..


నెల్లూరు నేతాజీనగర్‌కి చెందిన కుందూరు రాజేష్-శివజ్యోతి దంపతుల కుమారుడు నాగదర్శన్. ఇథాకా ఇంటర్నేషన్ స్కూలులో ప్రస్తుతం గ్రేడ్-1 చదువుతున్నాడు. తల్లిదండ్రుల ప్రోత్సా హంతో స్కేటింగే ప్రాణంగా ప్రతిరోజూ సీనియర్లతో కలిసి సాధన చేస్తున్నాడు. అతడిలోని క్రీడా ప్రతిభను గుర్తించిన సీనియర్లు మరింత ఉత్తమ శిక్షణ అందిస్తే ఉన్నతంగా రాణిస్తాడని సూచించారు. దీంతో 2023లో తల్లి దండ్రులతోపాటు తాత నాగేశ్వరరావు చొరవ తీసుకుని అసోసియేషన్ ద్వారా చిల్డ్రన్స్ పార్కులోని స్కేటింగ్ రింక్‌లో ప్రత్యేక శిక్షణ ఇప్పించేందుకు కృషిచేశారు. అక్కడే ప్రత్యేక శిక్షణ తీసుకున్న ఆ బాలుడిలోని క్రీడాప్రతిభ ను గుర్తించిన అసోసియేషన్ నిర్వాహకులు పలు పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పించారు.

ఎన్నో పతకాలు సొంతం

జిల్లాస్థాయిలో సబ్‌జూనియర్ విభాగంలో రోలర్ స్కేటింగ్‌లో సత్తాచాటి, రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యాడు. 2024లో కాకినాడలో జరిగిన ఏపీ ఓపెన్ రోలర్ స్కేటింగ్‌లో రెండు బంగారు పతకాలు సాధించాడు. అనంతరం అదే ఏడాది కాకినాడలోనే జరిగిన 36వ ఆర్‌ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్‌లో బంగారుపతకం సాధించి, జాతీయ పోటీలకు అర్హత సాధించాడు. మైసూర్‌లో జరిగిన 63వ జాతీయ పోటీల్లో సత్తాచాటి కాంస్య పతకం సొంతం చేసుకున్నాడు. అతిచిన్న వయసులోనే పతకాలు సాధిస్తున్న నాగదర్శన్‌లోని క్రీడా ప్రతిభను గుర్తించిన జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారులు ఈ ఏడాది రిపబ్లిక్ దినోత్సవం నాడు ఉత్తమ క్రీడాకారుడిగా ఎంపిక చేశారు. దీంతో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నాడు.

అంతర్జాతీయ స్కేటింగ్‌లో రాణించాలని..

ఈ సందర్భంగా చిన్నారి నాగదర్శన్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్కేటింగ్‌లో పత కాలు సాధించడమే లక్ష్యంగా సాధన చేస్తున్నానని తెలిపాడు. అసోసియేషన్‌తోపాటు సీనియర్ క్రీడాకారుల సహకారంతో మరింత ఉత్తమ శిక్షణ పొంది జిల్లా కీర్తిని ఇనుమడింప చేస్తా నని చెప్పాడు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఈ పతకాలు సాధిస్తున్నానని వివరించాడు. ఇదే స్ఫూర్తితో చదువులోనూ ఉత్తమంగా రాణిస్తూనే క్రీడల్లో కూడా సత్తా చాటుతానని పేర్కొన్నాడు.



ఆదిత్యునికి దత్తపీఠాధిపతి పూజలు

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు సుజాతమ్మ కాలనీలోని అష్టలక్ష్మీ ఆలయంలో రథసప్తమి సందర్భంగా సూర్య భగవానుడికి దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి, పీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థస్వామిజీ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గణపతి సచ్చిదానంద స్వామి తలపై అఖండ జ్యోతి, చేతుల్లో దీపాలతో ఆదిత్యునికి నీరాజనాలు అర్పించారు. ఈ సందర్భంగా ఆలయం లో సౌర హోమం, కార్యసిద్ధి ఆంజనేయస్వామికి వెన్నతో అలంకారం జరిగాయి. పీఠాధిపతి దత్త క్షేత్ర యాత్రను ముగించుకుని కడపకు తరలి వెళ్లారు. వేడుకలను ఆలయ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్, ట్రస్టీలు పర్యవేక్షించారు.

సూర్యభగవానుడికి నీరాజనాలు అర్పిస్తున్న గణపతి సచ్చిదానంద స్వామి

ద్వారకాపీఠం సంస్థాపన మహోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఆదిశంకరాచార్యులు గుజరాత్‌లో స్థాపించిన పశ్చిమామ్నాయ ద్వారకా పీఠం సంస్థాపన మహోత్సవాలు నగరంలోని పొగతోట ఆదిశంకర ధ్యాన మందిరంలో మంగళవారం జరిగాయి. ఈ కార్యక్రమాన్ని చక్రాలవారి ట్రస్ట్, ఆదిశంకరా ధ్యాన మందిరం ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించాయి. ధ్యాన మందిరం మేనేజర్ సమయానందనాథ స్వామి ద్వారకా పీఠం విశేషాలు తెలిపారు. ద్వారకా క్షేత్రం, కృష్ణతత్వంపై పద్య కవి డాక్టర్ సింగరాజు శివరామకృష్ణరావు శర్మ ప్రసంగించారు. సురభి మహాలక్ష్మి బృందం సౌందర్యలహరి గానం చేసింది.

నీరు-చెట్టు బిల్లులకు బ్రేక్!

- సీఎఫ్ఎంఎస్ ఆగిపోవడంతో అప్‌లోడ్ కాని బిల్లులు
- కాంట్రాక్టర్లలో ఆందోళన
- సీఈ దృష్టికి తీసుకెళ్లాం : ఇరిగేషన్ ఎస్ఈ

నెల్లూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : నాడు వైసీపీ ప్రభుత్వం, నేడు అధికారుల రూపంలో నీరు-చెట్టు బిల్లులకు గ్రహణం వెంటాడుతోంది. జనవరి నెలాఖరులోపు నీరు-చెట్టు బిల్లులన్నీ అప్‌లోడ్ చేయాలని కూటమి ప్రభుత్వం నవంబరులోనే ఆదేశించింది. అయితే ఆ గడువులోపు చాలా బిల్లులు అప్‌లోడ్ జరగలేదు. ఇప్పుడు సీఎఫ్ఎంఎస్ హెడ్ క్లోజ్ అవడంతో బిల్లులు అప్‌లోడ్ చేసేందుకు వీల్లేకుండా పోయింది. మళ్లీ ఎప్పుడు అవకాశం ఇస్తారు? ఇంకెప్పుడు అప్‌లోడ్ చేస్తారు? అని నీరు-చెట్టు బాధితులు ఆందోళన చెందుతున్నారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడే నాటికి జిల్లాలో 2433 నీరు-చెట్టు పనులకు సంబంధించి రూ.191.29 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉంది. అయితే అప్పట్లో నీరు-చెట్టు పనులపై అనేక రకాల ఎంక్వయిరీలు వేసి బిల్లులు చెల్లింపులో జాప్యం చేశారు. చివరకు కాంట్రాక్టర్లు హైకోర్టును ఆశ్రయించడంతో కొన్ని బిల్లులకు మోక్షం కలిగింది. ఇంకా కొన్ని కేసులు కోర్టులో పెండింగ్ ఉండగా, మరికొంత మంది కోర్టుకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. అయితే ఇంతలో ప్రభుత్వం మారడం, కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో నీరు-చెట్టు బిల్లులను పూర్తిగా చెల్లించాలని నిర్ణయించింది. ఇందుకుగానూ బడ్జెట్‌ను కూడా కేటాయించింది. ఈ బిల్లులను టాప్ ప్రియారిటీ కింద తీసుకొని వేగంగా అప్‌లోడ్ చేయాలని ఇరిగేషన్ శాఖను ఆదేశించిచంది. అయితే ఎప్పుడో జరిగిన పనులు కావడంతో కొన్ని ఎంబుక్‌లు కనిపించకపోవడం, అప్పట్లో పనులు చేయించిన అధికారులు బదిలీ అవడంతో జాప్యం జరిగింది. మరికొంత మంది అధికారులు ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేశారన్న విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పనులు చేసిన కాంట్రా క్టర్లు ఇరిగేషన్ కార్యాలయాల చుట్టూ తిరగడం మొదలుపెట్టారు. నీరు-చెట్టు బిల్లుల అప్‌లోడ్‌లో జరుగుతున్న జాప్యంపై గత నెలలో 'ఆంధ్రజ్యోతి' కూడా కథనాలు ప్రచురించింది. ఆ తర్వాత ఇరిగేషన్ అధికారులు కొంత కదిలినప్పటికీ ఈలోపు సీఎఫ్ఎంఎస్ హెడ్ క్లోజ్ అయిపోయింది. జిల్లాలో ఇంకా సుమారు రూ.20 కోట్లకు సంబం ధించిన 700లకుపైగా బిల్లులు పెండింగ్ ఉన్నాయని అంచనా. వీటన్నింటినీ అప్‌లోడ్ చేయాలంటే మరికొంత సమయం అవసరమవుతుంది. ఈ విషయంలో ఎమ్మెల్యేలు జోక్యం చేసుకొని ప్రభుత్వంతో మాట్లాడితే గానీ కాంట్రాక్టర్లకు న్యాయం జరగదు. కాగా ఈ విషయంపై ఇరిగేషన్ ఎస్ఈ దేశా నాయక్‌ను వివరణ కోరగా నీరు-చెట్టు బిల్లులు అప్‌లోడ్‌కు సంబం ధించి సీఎఫ్ఎంఎస్ హెడ్ ఆగిపోయిన మాట వాస్తవమేనని చెప్పారు. ఈ విషయాన్ని మైనర్ ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే సీఎఫ్ఎంస్ హెడ్‌లు ఓపెన్ అవకాశాలున్నాయని పేర్కొన్నారు.

- జూన్ వరకు పెళ్లిళ్లు
- కళకళలాడనున్న మార్కెట్
- కల్యాణ మండపాలకు డిమాండ్

మనుబోలు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మాఘమాసం వచ్చేసింది. పెళ్లి సందడి మొదలైంది. మాఘమాసంలో వివాహాలకు ఒక ప్రత్యేకత ఉంది. ఈ సీజన్‌లో పెళ్లిళ్లు చేసుకునేందుకు వధూవరుల కుటుంబాలు ఆసక్తి చూపుతాయి. వాతావరణం అనుకూలంగా ఉండడంతో పాటు పంటలు చేతికి వచ్చి విరామ సమయంగా ఉండటంతో వివాహాలకు అనువైన సమయంగా భావిస్తుంటారు. ఇప్పటికే ఈ మాసం ప్రారంభమై ఊపందుకున్న వివాహాల సీజన్ నాలుగు నెలల పాటు కొనసాగనుంది. ఈ నేపథ్యంలో కల్యాణ మండపాలకు డిమాండ్ పెరిగింది. దీంతోపాటు ఇతర దుకాణాల్లో వ్యాపారాలు జోరందుకున్నాయి. దీంతో పట్టణాలు, పల్లెల్లో సందడి నెలకొంది. కల్యాణ మండపాలు, అలంకరణ, లైటింగ్, పూల అలంకరణలు, బ్యూటీషియన్, ఫొటో, వీడియో తదితర వాటికి గిరాకీ పెరిగింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా మాఘమాసం ముందుగా రావడంతో ఫిబ్రవరిలోనే రికార్డుస్థాయిలో వివాహాలు జరగనున్నాయి. మాఘ, ఫాల్గుణ, చైత్ర, వైశాఖ, జ్యేష్ఠమాసం కొంతవరకు వివాహాల ముహూర్తాలున్నాయి. వీటితోపాటు గృహప్రవేశాలు, కొత్త ఇంటి నిర్మాణాలకు శంకుస్థాప నలు, కొత్తగా నిర్మించిన ఆలయాల ప్రారంభోత్సవాలకు ఈ నాలుగు నెలల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయి.



శుభకార్యాలకు వేళాయే!

ముహూర్తాల తేదీలు ఇవే...

- ఫిబ్రవరి : 2, 6, 7, 8, 12, 13, 14, 15, 16, 20, 22, 23
- మార్చి : 1, 2, 7, 9, 12, 14, 15, 16
- ఏప్రిల్ : 9, 10, 11, 12, 17, 18, 20, 23, 29, 30
- మే : 1, 7, 8, 9, 10, 11, 14, 15, 16, 17, 18, 21, 22



అద్భుతమైన ముహూర్తాలు

అన్ని శుభకార్యాలకు ఈ నెల నుంచి జూన్ 8వ తేదీ వరకు అద్భుతమైన శుభ ముహూర్తాలు ఉన్నాయి. చాలా కాలం తరువాత వరుసగా నాలుగు నెలల పాటు ఇన్ని ముహూర్తాలు రావడం విశేషం. తరువాత ఆశ్వయుజ మాసంనుంచి మార్గశిరం వరకు చాలా ముహూర్తాలు ఉన్నాయి. పై ముహూర్తాలు అందరికీ వర్తించవు. వారి వారి జాతకాలు ప్రకారం సరిచూసుకోవాలి.

- అవధానం జయసింహ శర్మ, వేదపండితుడు

న్యూస్ బాక్స్

సోమశిలలో 66.189 టీఎంసీల నీటి నిల్వ

అనంతసాగరం ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి మంగళవారం 1,421 క్యూసెక్కులు ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, 66.189 టీఎంసీల నీటి నిల్వ ఉందని, దిగువ కండలేరుకు 200, డెల్టాకు 2,750, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామని వారు తెలిపారు.

పీజీ, ఎల్ఎల్‌బీ పరీక్షలకు 56 మంది గైర్హాజరు

వెంకటాచలం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలో మంగళవారం జరిగిన పీజీ మొదటి, ఎల్ఎల్‌బీ మూడవ సెమిస్టర్ పరీక్షలకు 56 మంది గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షలకు 165 మంది విద్యార్థులకు 122 మంది హాజరు కాగా 43 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 79 మందికి 66 మంది హాజరు కాగా 13 మంది గైర్హాజరయ్యాని పేర్కొన్నారు.

కేవీలో కాంట్రాక్ట్ టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరం కొత్తూరులోని పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయంలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేసే టీచర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కే శంకరయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పూర్తి వివరాలను విద్యాలయ వెబ్‌సైట్ kothuru.kvs.ac.inలో పొందుపరిచా రన్నారు. ఈనెల 17న ప్రైమరీ టీచర్ పోస్టులకు, 18న పోస్ట్ గ్రాడ్యుయేషన్ టీచర్ విభాగంలో హిందీ, ఇంగ్లీష్, మ్యాథ్స్, బయాలజీ, ఫిజిక్స్ కెమిస్ట్రీ సబ్జెక్టులకు, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ పోస్టుల విభాగంలో ఇంగ్లీష్, మ్యాథ్స్, సోషల్, సైన్స్, హిందీ, సంస్కృతం పోస్టులకు ఉదయం 10గంటల నుంచి ఎంపికలుంటాయని తెలిపారు. 18వతేదీ మధ్యాహ్నం 2 గంటలకు కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు, 19వతేదీ ఉదయం 10 గంటలకు యోగా టీచర్, స్పోర్ట్స్ కోచ్, మ్యూజిక్ కోచ్, ఆర్ట్ ఎడ్యుకేషన్‌కు, మధ్యాహ్నం 2 గంటల నుంచి స్పెషల్ ఎడ్యుకేటర్, నర్స్ ఎడ్యుకేషన్ కౌన్సిలర్, తెలుగు టీచర్ పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. అభ్యర్థులు ఆంగ్ల, హిందీ భాషల్లో బోధనా సామ ర్థ్యం కలిగి ఉండాలన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఒక సెట్ జెరాక్స్ కాపీతో హాజరుకావాలని కోరారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని కల్యాణి నగర్‌కు చెందిన బాలిక అదృశ్యంపై వేదాయపాళెం స్టేషన్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... కల్యాణి నగర్‌లో భారతి, నరసింహులు దంపతులు నివసిస్తున్నారు. వారికి నలుగురు సంతానం. 17 ఏళ్ల పెద్ద కుమార్తె స్వప్న ఇంటి వద్దనే ఉంటోంది. ఆమె ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తల్లి భారతి చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో మంగళవారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఫార్మసీ విద్యార్థిని అదృశ్యం

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి4, (ఆంధ్రజ్యోతి) : ఫార్మసీ చదువుతున్న ఓ విద్యార్థిని అదృశ్యమైనట్లు నెల్లూరు రూరల్ సీఐ గుంజి వేణు తెలిపారు. ఈ మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఒంగోలుకు చెందిన పీ శ్రావ్య ముత్తుకూరు మండలంలోని ఓ ప్రైవేటు ఫార్మసీ కాలేజీలో చదువుతోంది. సోమవారం పరీక్ష రాసేందుకు కాకుపల్లి వద్దనున్న మరో కాలేజీకి వెళ్లింది. ఆ తర్వాత కనిపించకుండా పోయిందని, ఆమె తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	118
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	238
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8026
వెండి కిలో ధర	రూ. 96,600
వెండి ఒక గ్రాము	రూ.99.60

పాఠశాలను విలీనం చేయవద్దని ఆందోళన

తమ గ్రామంలో 50 ఏళ్లుగా ఐదోతరగతి వరకు ఉన్న పాఠశాల విద్యార్థులను పోలంగారిపల్లి పాఠశాలలో విలీనం చేయవద్దని మంగళవారం సీతారామపురం ఎంఈవో కార్యాలయం వద్ద అయ్యవారిపల్లి ఎస్సీ కాలనీవాసులు ఆందోళన చేశారు. అనం తరం ఎంఈవో మస్తాన్‌వలికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ తమ గ్రామంలో యాభై ఏళ్ల నుంచి పాఠశాలను కొనసాగిస్తున్నారని, ప్రస్తుతం అధికారులు గ్రామంలోని 3,4,5 తరగతుల విద్యార్థులను పోలంగారిపల్లిలోని పాఠశాలకు పంపమన్నారని పేర్కొన్నారు. ఇది చాలా అన్యాయమని పేర్కొన్నారు. మా గ్రామ పాఠశా లలోనే తమ పిల్లలను ఉంచాలంటూ నిరసన వ్యక్తం చేశారు. ఎంఈవో మాట్లాడుతూ మీ పిల్లలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని, పోలంగారిపల్లిలో మోడల్ పాఠశాలను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు.

- సీతారామపురం, (ఆంధ్రజ్యోతి)



సార్.. చిరుత... అయితే జాగ్రత్త!

- హడలెత్తించిన ఆకతాయి చేష్టలు
- పోలీసులు, స్థానికుల హడల్
- తీరా చూస్తే అది బొమ్మ చిరుత

ఓ ఆకతాయి చేష్టలు ఇటు పోలీసులను, అటు స్థానికులను భయభ్రాంతులకు గురి చేసింది. కోవూరు శాంతినగర్ శివార్లలో మంగళవారం రాత్రి పొదల్లో చిరుత పులి నక్కి ఉందంటూ ఎస్ఐ రంగనాథ్ గౌడ్‌కు ఫోన్ వచ్చింది. అప్పటికే స్టేషన్‌లో ఉన్న ఆయన ఫోన్ చేసిన వ్యక్తిని చిరుత కదలికలను దూరం నుంచే గమనించమని సూచించారు. అప్పటికే చిరుత సమాచారం శాంతిగర్‌వాసులను తట్టిలేపింది. దీంతో అందరూ భయకంపితుల య్యారు. ఇళ్లలోకి చిరుత చొరబడకుండా అడ్డుకట్టు వేశారు సుభాష్ సేవా సంఘం అధ్యక్షుడు దేవిరెడ్డి సురేష్‌రెడ్డి కూడా పోలీసుస్టేషన్‌కు పరుగులు తీశాడు. అప్పటికే ఎస్ఐ ఉన్నతాధికారులకు సమాచారం అందజేసి, తుపాకీలో బుల్లెట్లను చొప్పించి జీపులో ఘటనాస్థలికి బయలుదేరారు. పొదల వద్ద అందరి చేతుల్లో ఆయుధాలు. ఎస్ఐ చేతిలో రివాల్వరుతో అప్రమత్తంగా ఉన్నారు. నెమ్మదిగా ముందుకు కదిలారు. అంతమంది కదలి ముందుకు వస్తుంటే ఉరకకుండా ఉన్న చిరుతను చూసి ఎస్ఐకు అనుమానం వచ్చింది. ఒక్కసారి అందరినీ ఆగమన్నాడు. చిరుత కాదు.. ఇంకేదో ఉందంటూ సైగ చేశారు. అందరూ కలిసికట్టుగా పొదల దగ్గరకు వెళ్లారు. తీరా చూస్తే అక్కడున్నది పెద్దసైజు చిరుతబొమ్మ. ఆకతాయిలెవరో ఇలా చేసి ఉంటారని గ్రహించిన పోలీసులు, స్థానికులు ఆ బొమ్మను దహనం చేశారు. సమాచారం అందిన వెంటనే స్పందించిన ఎస్ఐ రంగనాథ్‌గౌడ్, పోలీసులను స్థానికులు అభినందించారు.

- కోవూరు (ఆంధ్రజ్యోతి)



పొదల మాటు నుంచి తీసిన చిరుత బొమ్మను పరిశీలిస్తున్న పోలీసులు

మార్చి ఆఖరుకు ఉదయగిరి ఆనకట్ట సుందరీకరణ

- జలవనరుల శాఖ ఎస్ఈ



ఆనకట్ట సుందరీకరణ పనుల మ్యాపును పరిశీలిస్తున్న ఎస్ఈ దేశనాయక్

ఉదయగిరి, ఫిబ్రవరి 4(ఆంధ్ర జ్యోతి): మార్చి నెలాఖరుకు ఉద యగిరి ఆనకట్ట సుందరీకరణ పనులు పూర్తి చేయనున్నట్లు జలవనరుల శాఖ ఎస్ఈ దేశనా యక్ పేర్కొన్నారు. మంగళవారం అధికారులతో కలిసి ఆయన పనులు తనిఖీ చేసి మ్యాపును పరిశీలించారు. అనంతరం మాట్లా డుతూ గ్రామ కొలను పథకంలో భాగంగా 2022లో జిల్లాలోని 38 చెరువుల సుందరీకరణ పనులకు రూ.70 కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. సుందరీకరణ పనుల్లో భాగంగా చెరువుల కట్టలను ఆధునికీకరించడం, వాకింగ్‌ట్రాక్, దీపాలు, ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందించడంతోపాటు వారు సేద తీరేందుకు బెంచీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం మారడంతో పనుల్లో జాప్యం జరిగిందన్నారు. ప్రస్తుతం ఉదయగిరి, రాపూరు, సీతారామపురం మండలాల్లో పనులు వేగంగా జరుగుతున్నా యన్నారు. ఉదయగిరి ఆనకట్ట వద్ద రూ.7 కోట్లతో పనులు జరుగుతున్నాయన్నారు. జిల్లాలో ఇప్పటివరకు ఈ పథకంలో భాగంగా రూ.15 కోట్లు ఖర్చు చేశామన్నారు. పనులు ప్రారంభించని గ్రామాల్లో మళ్లీ మరో పథకం ద్వారా చెరువుల సుందరీకరణకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే మండలంలోని పొన్నెబోయిన చెంచురామయ్య గండిపాళెం జలాశయం, లింగాలచెరువులను కూడా ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో జలవనరుల శాఖ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ చంద్రమౌళి, ఏఈలు వేణు, సురేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక లావాదేవీలు లోక్ యాప్‌లో నమోదు చేయాలి

- డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండల సమాఖ్యలు తమ ఆర్థిక లావాదేవీలను లోక్ యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని డీఆర్‌డీఏ పీడీ నాగరాజ కుమారి ఆదేశించారు. మంగళవారం డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో లోక్ యాప్ లావాదేవీల నమోదుపై సమాఖ్య సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ నమోదులో ఎవరూ నిర్లక్ష్యం చూపరాదన్నారు. లావాదేవీల నమోదు వల్ల సంఘాల సంస్థాగత నిర్మాణం బాగుందని నిధులు ఎక్కువ గా వచ్చే అవకాశం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీపీఎంఐబీ కామాక్షి, ఫైనాన్స్ డీపీఎం సూరిబాబు, ఏపీఎం ఐబీ వెంకటేశ్వర్లు, డీఎంజీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హిట్ అండ్ రన్ ఆర్థిక అండ

- గుర్తుతెలియని వాహనాలు ఢీకొని వెళ్లిపోతే సాయం
- క్షతగాత్రులకు రూ.50 వేలు, మృతుల కుటుంబాలకు రూ.2లక్షలు
- ప్రయోజనకరంగా కేంద్రం పథకం
- అవగాహన కల్పించడంలో యంత్రాంగం విఫలం





నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల సంఖ్య ఏడాది ఏడాదికి పెరుగుతోంది. జిల్లాలో గతేడాది 440 మంది మృతి చెందగా రాష్ట్రంలో 10 వేల మంది, దేశంలో 1.25 లక్షల మంది మృతి చెందినట్లు గణాంకాలు చెబుతు న్నాయి. రోడ్డు ప్రమాదాలతో క్షతగాత్రులైన వారి సంఖ్య భారీగానే ఉంటోంది. రోడ్డు ప్రమాదాల్లో ఇంటి యజమానిని కోల్పోయిన ఎన్నో కుటుంబాల పరిస్థితి తారుమారు అవుతోంది. ప్రమాదా నికి కారణమైన వాహనాన్ని గుర్తిస్తే ఆ వాహనానికి ఉన్న ఇన్సూరెన్స్, ఇతర మార్గాల ద్వారా బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందుతుంది. అయితే ప్రమాదాలకు కారణమైన వాహనాలను గుర్తించలేకపోతే మాత్రం ఆ బాధితుల కుటుంబాల పరిస్థితి వర్ణనాతీతం. ఈ క్రమంలో గుర్తుతెలి యని వాహనాలు ఢీకొని ప్రమాదాల బారినపడిన వారు, మృతుల కుటుంబాలకు అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం హిట్ అండ్ రన్ పథకం ద్వారా ఆర్థిక సాయం అందిస్తోంది. అయితే ఈ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించడంలో యంత్రాంగం విఫలమవుతోంది.

2022 నుంచి అమల్లోకి...

రోడ్డుపై వెళ్తున్న వ్యక్తిని ఏదైనా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోతే ఆ ప్రమాదంలో సదరు వ్యక్తి గాయపడినా, మృతిచెందినా హిట్ అండ్ రన్ చట్టం కింద కేసు నమోదవుతుంది. గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లిపోతే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేస్తారు. దర్యాప్తు చేపట్టిన ఆరు నెలల నుంచి సంవత్సరంలోపు ప్రమాదా నికి కారణమైన వాహనాలను గుర్తించాల్సి ఉంది. అలా గుర్తించలేకపోతే హిట్ అండ్ రన్ చట్టం ప్రకారం గాయపడిన వ్యక్తికి రూ.50 వేలు, మరణించిన వ్యక్తి కుటుంబానికి రూ.2 లక్షలు కేంద్రం ఆర్థిక సాయం అందిస్తుంది. ఈ పథకాన్ని 2022లో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. అయితే దీనిపై అవగాహన లేకపోవడంతో ఎంతో మంది సద్వినియోగం చేసుకోలేక పోతున్నారు. ఈ పథకాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లడంలో అన్ని ప్రభుత్వ శాఖలు విఫలం అవుతున్నాయి.

దరఖాస్తు ఇలా...

- ఫారం-1 దరఖాస్తులో ప్రమాదం ఎప్పుడు, ఎక్కడ, ఎలా జరిగింది. ప్రమాదంలో ఎలాంటి గాయాలయ్యాయి, చికిత్స వివరాలు పొందుపరచాలి.
- ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు జతచేయాలి.
- ప్రమాదంలో ఎవరైనా మరణిస్తే వారి కుటుంబ సభ్యులు తమ బ్యాంకు ఖాతా కాపీ జత చేయాలి.
- బాధితులు ఏదైనా వైద్యశాలలో సొంత నగదుతో చికిత్స పొంది ఉంటే ఆ నగదు రీఫండ్ పొందేందుకు ఫారం-4 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- చికిత్స పొందిన వైద్యశాల, ఖర్చు రశీదులు, ఎఫ్ఐఆర్ కాపీ, మృతి చెందితే పోస్టుమార్టం రిపోర్ట్, డెత్ సర్టిఫికెట్ జత చేసి రెవెన్యూ, పోలీసు అధికారులకు సమర్పించాలి.
- అధికారులు విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదిక పంపిస్తారు.
- విచారణ అనంతరం 15 రోజుల్లో బాధితుల ఖాతాలో నగదు జమ చేస్తారు.

వీఎస్‌యూలో జాబ్‌మేళా

ఉద్యోగాలకు 39 మంది ఎంపిక

వెంకటాచలం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని విక్రమ సింహపురి యూనివర్సిటీలో మంగళవారం జరిగిన జాబ్‌మేళా విజయవంతమైంది. వీఎస్‌యూ, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, జిల్లా ఎంప్లాయ్‌మెంట్, సీడాప్ సంయుక్తంగా నిర్వహించిన ఈ జాబ్ మేళాలో ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు చేశారు. 68 మంది నిరుద్యోగ యువకులు పాల్గొనగా 39 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ముఖ్యఅతిథిగా వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ సారంగం విజయ భాస్కర్‌రావు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ అబ్దుల్ ఖయ్యూమ్, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ వినయ్‌కుమార్, సీడాప్ కోఆర్డినేటర్ డాక్టర్ జీ మేరీ సందీప్ తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కంపెనీల ప్రతినిధులు

స్వచ్ఛ గాలికి చర్యలు

నగర కమిషనర్ సూర్యతేజ



మద్రాస్ ఐఐటీ విద్యార్థుల సమావేశంలో కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : నగర వాసులకు స్వచ్ఛమైన గాలిని అందించేందుకు అన్నిరకాల చర్యలు చేపట్టబోతున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన మంగళవారం మద్రాసు ఐఐటీ విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లా డుతూ సిటీలో స్వచ్ఛమైన ప్రాణవాయువు లభిం చేలా అవసరమైన రోడ్డు డస్ట్ కలెక్టర్స్ ఎయిర్ ప్యూరిఫయర్ల పనితీరును పరిశీలించామని, ఆ మేరకు ఏర్పాటు జరుగుతుందని చెప్పారు. మురుగు నీటి శుద్ధి కేంద్రాల వద్ద హానికరమైన వాయువుల నియంత్రణకు కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం నీటి పన్ను వసూళ్లపై సచివాలయ ఉద్యోగులతో కమి షనర్ సమీక్షించారు. 8వ డివిజన్‌లో పారిశు ధ్యా న్ని పరిశీలించి, వీధి కుక్కల నియంత్రణకు అధి కారులకు ఆదేశాలిచ్చారు.

అభివృద్ధికి సహకరించండి : ఎమ్మెల్యే కోటంరెడ్డి

తన నియోజకవర్గంలోని నగర డివిజన్ల అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి చేయూతనివ్వాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నగర కమిషనర్ సూర్యతేజను కోరారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్‌తో ఎమ్మెల్యే భేటీ అయ్యారు. రోడ్లు, డ్రైన్లు అత్యవసరంగా నిర్మించాల్సి ఉందన్నారు. దోమల నివారణకు ప్రత్యేక కార్యాచరణ కొనసాగుతుందని చెప్పారు. 1వ డివిజన్‌లో పారిశుధ్య సమస్యను సత్వరం పరిష్కరించాలని కోరారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించారు.

ఎంపీటీసీ నివాసంలో అగ్నిప్రమాదం



దగ్ధమైన ఎంపీటీసీ ఇంటి ముందు పందిరి

ఉదయగిరి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడినరవ గ్రామంలో ఎంపీటీసీ అంబటి భాస్కర్‌రెడ్డి నివాసంలో సోమవారం అర్ధరాత్రి అగ్నిప్ర మాదం జరిగింది. రేకుల ఇంటి ముందున్న తాటాకు పందిరికి నిప్పంటుకొని పూర్తిగా దగ్ధమైంది. పందిరి కాలిపోతున్న విషయాన్ని ఆయన సోదరుడు గుర్తించి మంటలను ఆ పేందుకు యత్నించినా, అప్పటికే పూర్తిగా కాలిపోయింది. తమ ప్రత్య ర్థులు ఇంటికి నిప్పంటించారని ఎంపీటీసీ అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కాగా సమాచారం అందుకున్న ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. వివరాలు సేకరించి విచారణ జరుపుతున్నారు.

అనుమానితులకు క్యాన్సర్ పరీక్షలు

- డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత



పోస్టర్లు విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో సుజాత, వైద్యాధికారులు

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్యాన్సర్ వ్యాధి గ్రస్తులను గుర్తించేందుకు ప్రత్యేక సర్వే చేస్తున్నామని, అనుమానిత కేసులు ఉంటే వెంటనే వారికి అన్ని రకాల నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని వైద్యాధికారులను డీఎంహెచ్‌వో సుజాత ఆదేశించారు. డీఎంహెచ్‌వో చాంబర్‌లో మంగళవారం ఎన్‌సీడీ విభాగం వైద్యులు, సిబ్బందితో కలిసి క్యాన్సర్ అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిపై ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహించి చికిత్సలు అందిస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి, డీఐవో డాక్టర్ ఉమామహేశ్వరి, ఎన్‌సీడీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రిలో మెరుగైన వైద్య చికిత్సలు

- పాలక మండలి చైర్మన్ విజయకుమార్‌రెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న రెడ్‌క్రాస్ కమిటీ చైర్మన్ విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందిస్తున్నామని రెడ్‌క్రాస్ పాలక మండలి చైర్మన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి వెల్లడించారు. మంగళవారం ప్రపంచ క్యాన్సర్ అవగాహన దినం సందర్భంగా ఆసుపత్రిలో నర్సింగ్ విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌పై ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. ఆసుపత్రి చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. క్యాన్సర్ వ్యాధి రాకుండా బాలబాలికలు టీకా వేయించుకోవాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో వైద్య నిపుణులు డాక్టర్ రామ్మోహన్‌రావు, డాక్టర్ గీతా ఉషశ్రీ, డాక్టర్ లోకేశ్వరి, డాక్టర్ హేమంత్, డాక్టర్ ముత్తు, డాక్టర్ హరితరాణి, ఆసుపత్రి మేనేజర్ భక్తవత్సలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

ఊరంతా సిమెంట్ రోడ్ల నిర్మాణం

- మూడు దశాబ్దాల కల నెరవేరిన వేళ
- రూ.35లక్షల ఉపాధి నిధులతో 12 సీసీరోడ్ల నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న గమళ్లపాలెం వాసులు

జలదంకి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో గమళ్లపాలెం గ్రామం జలదంకి పంచాయతీలో ఉంది. ఈ గ్రామంలో వందకు పైగా కుటుంబాలున్నాయి. అందరూ బీసీ సామాజిక వర్గానికి చెంది గౌడ కులస్థులే. గత 30ఏళ్లుగా వీరు అంతర్గత వీధులు బాగు చేయాలని చేయని పోరాటం లేదు. అందుకోసం వీరు గ్రామం నుండి మండలకేంద్రం వరకు, అక్కడి నుంచి కావలి ఆర్డీఓ కార్యాలయంకు పాదయాత్ర కూడా చేశారు. జలదంకి బస్టాండ్‌లో నిరసనదీక్షలు అనేకమార్లు చేపట్టారు. అయినా వారి కోరిక నెరవేరలేదు. గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎన్నికల ప్రచారంకు వచ్చిన ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు గ్రామస్థులు తమ బాధలు చెప్పుకున్నారు. ఎమ్మెల్యే అయిన వెంటనే చేయిస్తామని హామీ ఇచ్చారు. చెప్పిన మాట మేరకు సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.35లక్షల ఉపాధి నిధులు కేటాయించి పనులు మొదలుపెట్టారు. పనులు చేపట్టిన 15రోజుల వ్యవధిలోనే 12రోడ్ల నిర్మాణం పూర్తి చేయించడంతో గ్రామస్థులు ఆశ్చర్యంతో పాటు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామస్థుల తరఫున ధన్యవాదాలు



ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన మాట నిలబెట్టుకుని సీసీ రోడ్డు వేయించారు. గతంలో ఏ ఎమ్మెల్యే కూడా ఇలా ఇచ్చినమాట నిలబెట్టుకోలేదు. ఇపుడు ఇబ్బందులన్నీ తీరాయి. సీఎం, డిప్యూటీ సీఎం చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లకు గ్రామం తరుపున ధన్యవాదాలు తెలుపుతున్నా.

- మాతిన సుబ్బరత్తమ్మ, గమళ్లపాలెం



గమళ్లపాలెంలో నిర్మించిన సీసీ రోడ్డు

ఎమ్మెల్యే అంటే సురేష్‌లా ఉండాలి



మా ఎమ్మెల్యే మాట చెప్పాడంటే చేయకుండా మానడు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను హామీలుగా వదిలేయకుండా డైరీ రాసుకుని దాని ప్రకారం చెప్పిన పనులన్నీ వరుసగా చేస్తున్నాడు. జలదంకి మండలం అబివృద్ధిలో నియోజకవర్గంలోనే మొట్టమొదటి స్థానంలో నిలబెడు తున్నాడు. గమళ్లపాలెం ప్రజలు ఎంతో కాలంగా పడుతున్న ఇబ్బందులు తీర్చడం ఆనందంగా ఉంది.

- పీ.మధుమోహన్‌రెడ్డి, సోమశిల ప్రాజెక్ట్ వైస్‌చైర్మన్

వర్షం వస్తే వెన్నులో వణుకు వచ్చేది..



వర్షాకాలంలో గ్రామంలోని వీధులన్నీ వర్షపు నీరు మురుగునీటి నిల్వతో దుర్గంధంగా ఉండేవి. వర్షాలు వస్తున్నాయంటే మాకు వెన్నులో వణుకు పుట్టేది. వీధుల జలమయంతో ఇంట్లోంచి నుండి బయటకు వచ్చేవాళ్లం కాదు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మా పాలిట దేవుడు. ఆయన చొరవతో మా గ్రామంలో రోడ్లు వేసేందుకు నిధులు కేటాయించారు. 15రోజుల్లో రోడ్లన్నీ వేయించాడు. చాలా ఆనందంగా ఉంది.

- సూరం పుష్పమ్మ, గమళ్లపాలెం

న్యూస్ బాక్స్

భోజనం ప్లేట్ల అందజేత

కొండాపురం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సాయిపేట పంచాయతీ ఎస్టీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలోని 70మంది విద్యార్థులకు మంగళవారం లైఫ్‌లైన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు తాటికొండ నవీన్, సాగునీటి సంఘ అధ్యక్షుడు తాటికొండ ప్రవీణ్‌లు భోజనప్లేట్లు, గ్లాసులు అందజేశారు. కాంగ్రెస్ మండల మాజీ కన్వీనర్ తాటికొండ రామమూర్తినాయుడు జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బాలక్రిష్ణయ, యుగం ధర్, మల్లికార్జున, వల్లూరు వెంకటేశ్వర్లు, అరుణ, అనుసూయమ్మ పాల్గొన్నారు.

పనులు ప్రారంభించాలి

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అన్ని గ్రామ పంచాయతీల్లోని కూలీలకు అవగాహన కల్పించి ఉపాధి పనులు ప్రారంభించాలని డ్వామా పీడీ గంగాభవాని తెలిపారు. స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో మంగళవారం ఆయన సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రతికూలీకి రోజుకు రూ.300 వేతనం తగ్గకుండా వేతనం వచ్చేలా చూడాలన్నారు. శ్రమశక్తి సంఘాలను త్వరతగతిన ఎంపిక చేయాలన్నారు. ఈ నెల 15వ లోపు మంజూరైన 24 గోకులం షెడ్ల నిర్మాణ పనులు పూర్తి చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీ బాబూరావు, ఏపీఓ ఉమామహేష్ జేఈ వంశీకృష్ణ, టీఏలు ప్రసాద్, మాలకొండయ్య, నాగార్జున అశోక్ పాల్గొన్నారు.

స్థల వివాదంపై విచారణ

బిట్రగుంట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జువ్వలదిన్నె పంచాయతీ వడ్డిపాలెంలో ప్రార్థన మందిర వివాదంపై మంగళవారం కావలి రూరల్ సీఐ పాపారావు, తహసీల్దారు సురేష్‌బాబు, ఎంపీడీవో సుబ్రమణ్యం విచారణ చేపట్టారు. మందిర ప్రాంతంలో నూతన నిర్మాణాలు చేపట్టకుండా ప్రార్థనలు చేసుకోవచ్చని తెలిపారు. .

ప్రతిభా పోటీలతోనే సృజనాత్మకత

కావలి టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రతిభా పోటీలతోనే సృజనాత్మక తెలుస్తుందని అగ్నిమాపక శాఖ అధికారి రామ్‌సిద్ధార్థ తెలిపారు. మంగళవారం రత్నమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశ్వశాంతి హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు గణిత ట్యాలెంట్ టెస్ట్ నిర్వహించారు. బహుమతి ప్రదానోత్సవంలో ఆయన పాల్గొని విజేతలకు నగదుతో పాటు మెమెంటో, ప్రశంసాపత్రాలను అందజేశారు. విశ్రాంత అధ్యాపకులు పీఎస్ ప్రసాద్ రత్నమ్మ ఫౌండేషన్‌తో పోటీలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాష పాల్గొన్నారు.

మెమో జారీకి ఆదేశం

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):మాలకొండ అంగన్‌వాడీ కార్యకర్త పార్వతి, సూపర్‌వైజర్ సునీతకు మెమో జారీ చేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ శర్మిష్టకు రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌భాస్కర్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన కేంద్రంను తనిఖీ సమయంలో పిల్లల హాజరు రిజిస్టరులో వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించి చర్యలకు ఆదేశించారు.

ఎంఈవో-2కి సన్మానం

అనంతసాగరం ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):మండల ఎంఈవో-2 కాటంరెడ్డి ప్రభాకరరెడ్డికి జిల్లా ఉత్తమ పురస్కారం లభించింది. ఈ సందర్భంగా నెల్లూరులోని టౌన్‌హాలులో మంగళవారం ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి, ఏపీ ప్రైవేటు విద్యాసంస్థల అధ్యక్షుడు తులసీ ప్రసాద్ చేతులు మీదుగా ప్రభాకరరెడ్డికి ప్రశంసాపత్రం అందించి ఘనంగా సన్మానించారు.

భవిష్యత్ కోసమే పోరాటం

కావలి టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తు కోసమే ఫీజు రీయింబర్స్‌పై పోరాటం అని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం ముసునూరు స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. బుధవారం చేపట్టనున్న ధర్నా పార్టీ నిర్ణయం మేరకు వాయిదా పడిందని, తదుపరి తేదీని ప్రకటిస్తామన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశం

సీతారామపురం, ఫిబ్రవరి 4 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని బసినేనిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం బసినేనిపల్లి, అయ్యవారిపల్లి స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ప్రైమరీ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు ఎంఈవో మస్తాన్‌వలి అధ్యక్షతన స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో గుణాత్మక విద్యను పెంపొందించుట, మోడల్ ప్రైమరీ స్కూళ్ల అభివృద్ధి పరచుట, ఎస్‌ఎంసి సభ్యుల ఆమోదం మేరకు ఫౌండేషన్ స్కూళ్లు, బేసిక్ ప్రైమరీ స్కూళ్లను మోడల్ ప్రైమరీ స్కూళ్లుగా మార్చేందుకు పేరెంట్స్ కమిటీ సభ్యుల సలహాలపై చర్చించారు.

హద్దు రాళ్ల తొలగింపు

కావలి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక తుమ్మలపెంట రోడ్డు, కొనదిన్నె గిజనకాలనీ ప్రాంతాల్లోని అనధికార లే అవుట్లను అధికారులు గుర్తించి సరిహద్దు రాళ్లు, కాలువలను ఎక్స్‌కవేటర్‌తో తొలగింపజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో పనులు జరిగాయి.



ఆలయాల్లో రథసప్తమి పూజలు

కావలి టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి పర్వదిన వేడుకలు మంగళవారం పట్టణంలో వైభవంగా జరిగాయి. బృందావనం కాలనీలోని వెంకటేశ్వరస్వామి ఆలయం, ముసునూరు హనుమత్ క్షేత్రం, కచ్చేరిమిట్ట వెంకటేశ్వరస్వామి ఆలయం, వెంగళరావునగర్‌లోని సూర్య భగవాన్ ఆలయాల్లో జరిగిన వేడుకల్లో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు.

- **బృందావనం కాలనీలో..**

హౌసింగ్‌కాలనీలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీరామ్ మాల్యాద్రి పర్యవేక్షణలో జరిగిన వేడుకల్లో స్వామి వారు సప్త వాహనాల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం సూర్యప్రభ వాహన సేవలతో ప్రారంభమై చిన్నశేషన, గరుడ, హనుమంత వాహన సేవలు నిర్వహించారు. మధ్యాహ్నం 1గంటకు చక్రస్నానం, కల్పవృక్ష వాహనం, సర్వభూపాల వాహనం, రాత్రి 8గంటలకు చంద్రప్రభ వాహన సేవలతో రథసప్తమి మహోత్సవం ముగిసింది. రథసప్తమి అన్నదాన కమిటీఆధ్వర్యంలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నసంతర్పణ కార్యక్రమం చేపట్టారు. కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

- అల్లూరు: స్థానిక గీతాశ్రమంలో జరిగిన వేడుకలో మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం యాగశాలలో నిర్వహించిన హోమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేపట్టారు. కార్యక్రమంలో అనంతరాజు బాలకృష్ణంరాజు, యరటపల్లి శేఖర్‌రెడ్డి, పప్పు సుధాకర్, మోమిడి మాధవరావు, ఏలూరు మధురెడ్డి, ఆదిలక్ష్మమ్మ, శకుతలమ్మ, దగదర్తి నాయకులు కొండపనాయుడు పాల్గొన్నారు.
- కొండాపురం: మండల ప్రజలు, భక్తులు సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు చేపట్టారు. జిల్లేడు ఆకులతో తలంటుస్నానం చేసి చక్కెరతో పొంగళిపెట్టి చిక్కుడు ఆకులలో స్వామివారికి నైవేద్యం పెట్టారు. రథ సప్తమితో వేసవికాలం ఆరంభమై ఎండ తీవ్రత నుండి తమన కాపాడాలంటూ భక్తులు వేడుకోవడం ఈపండుగ ఆనవాయితీ అని చెప్పారు.
- **వాడవాడలా వేడుకలు**

ఉదయగిరి: మండలంలోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే ఆలయాలకు చేరుకొని పంచామృతాభిషేకాలు, ఆకు, కుంకుమ పూజలు నిర్వహించారు. గండిపాళెం, గుడినరవ, అప్పసముద్రం, కుర్రపల్లి, లింగాలదొన, అయ్యవారిపల్లి, చెరువుపల్లిలో భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు.

- అనంతసాగరం: వరికుంటపాడు కోదండరామస్వామి ఆలయంలో వేడుకలను నిర్వహించి స్వామిని ఊరేగింపు చేపట్టారు.



కావలి: గరుడ వాహనంపై శ్రీవారు



ఉదయగిరి: గండిపాళెం అభయాంజనేయస్వామి ఆలయంలో..



అల్లూరు : పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి



అనంతసాగరం : కోదండరాముడి విగ్రహ ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ప్రతి పంచాయతీకి మోడల్ ప్రైమరీ స్కూల్

- పీవీ రమణయ్య, ఎంఈవో-2



ఉలవపాడు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం విద్యా వ్యవస్థలో ప్రవేశ పెట్టిన జీవో నెంబరు 117ను కూటమి ప్రభుత్వం రద్దు చేసి నూతన విద్యావ్యవస్థకు శ్రీకారం చుట్టబోతుందని ఎంఈవో-2 పీవీ రమణయ్య తెలిపారు.

? విద్యావ్యవస్థలో చేపట్టనున్న చర్యలేవీ.

! రానోవు విద్యా సంవత్సరంలో 3,4,5 తరగతి పిల్లల కోసం ప్రతి పంచాయితీలో మోడల్ ప్రైమరీ పాఠశాలను ఏర్పాటు చేయనుంది. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు క్లాస్ టీచర్‌ని నియమించేలా ఆలోచనలు చేస్తుంది.

? ఏకోపాధ్యాయ పాఠశాలలెన్ని ఉన్నాయి.

! మండలంలో 53ప్రాథమిక, 2యూపీ స్కూళ్లు ఉన్నాయి. అందులో ఏకోపాధ్యాయ పాఠశాలలు 14ఉన్నాయి. 117జీవో రద్దుతో తిరిగి ఆ పాఠశాలకు తరగతుల సంఖ్య, ఉపాధ్యాయుల సంఖ పెరుగుంది.

? హాజరుశాతం పెరిగేలా చర్యలేవి.

! ప్రవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను నడిపేందుకు మెరుగైన వసతులు కల్పిస్తాం. తల్లిదండ్రుల భాగస్వామ్యంతో మెగా పేరెంట్స్ డే, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, అవసరమైన 9రకాల వస్తువుల ఉచిత కిట్ బ్యాగ్ ఇస్తున్నాం.

? 10 ఉత్తీర్ణతశాతం పెరగనుందా.

! 10వ తరగతి విద్యార్థులకు గత నెల నుంచి 100 రోజులపాటు స్టడీ క్లాసులు నిర్వహిస్తున్నాం. వారికి ఎన్‌సీఈఆర్టీ స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేశాం. ఈ ఏడాది నుంచి ఎంఈవోలకు కూడా స్టడీ క్లాసులు నిర్వహణ పర్యవేక్షించమని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

రహదారి భద్రతపై అవగాహన కలిగి ఉండాలి



కలిగిరి: అవగాహన కలిగిస్తున్న వైద్య సిబ్బంది



కందుకూరు: వాహనదారులతో మాట్లాడుతున్న ఆర్డీవో



బిట్రగుంట: మాట్లాడుతున్న కావలి ఏఎంవీఐ కరుణాకరన్

కందుకూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కందుకూరు ఆర్డీవో టీవీఎస్.లక్ష్మి ఆధ్వర్యంలో అధికారులు స్థానిక పామూరురోడ్డు జంక్షన్‌లో ద్విచక్రవాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ విధిగా ధరించాల్సిన ఆవశ్యకతను వివరించారు. జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలను నియంత్రించవచ్చన్నారు. మద్యం సేవించి వాహనం నడిపినా, హెల్మెట్, సీట్ బెల్ట్ లేకుండా వాహనాలు నడిపిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంవీఐ సీహెచ్ రాంబాబు, నెల్లూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎంవీఐ బి. గోపినాయక్ పాల్గొన్నారు.

- బిట్రగుంట: కోవూరుపల్లి ఆరోగ్య కేంద్ర సిబ్బందికి ఆర్టీవో అధికారులు అవగాహన కల్పించారు. అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు కరుణాకరన్, లక్ష్మీ బాయ్‌లు హెల్మెట్ ధారణపై వివరించారు. కార్యక్రమంలో రోడ్డు సేఫ్టీ మెడికల్ ఆఫీసర్ స్వరూపరాణి వైద్యులు రాజశేఖర్, సీహెచ్‌వో సులోచన, పీహెచ్ఎన్ ఎఫ్ఎస్ మేరీ, విక్టోరియా రాణి ఉన్నారు.
- కలిగిరి: ప్రమాదం జరిగినపుడు తక్షణం బాధితుడికి అందించే ప్రథమ చికిత్సతో ప్రాణరక్షణకు తోడ్పడుతుందని పీహెచ్‌సీ వైద్యాధికారి బిజ్జం గీతారెడ్డి తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రవాహనదారులు సీట్ బెల్ట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి సునీల్‌కుమార్, సీహెచ్ఓ సాయిలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

సంగం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జెండాదిబ్బ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఎస్ఐ రాజేష్ సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లు ఎలా మోసాలకు పాల్పడుతున్నారు.. వాటి నుంచి ఎలా రక్షణ పొందాలని వివరించారు. ఎవరైనా సైబర్‌మోసాలకు గురైతే వెంటనే 1930కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మోహన్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- వలేటివారిపాలెం: అధునాతన టెక్నాలజీతో సైబర్ నేరాలకు తెగబడే విధానాన్ని స్టేట్ బ్యాంక్ మేనేజర్ నరేష్‌బాబు తెలిపారు. కాకర్లవారిపాలెం, వలేటివారిపాలెం స్టేట్‌బ్యాంక్‌లో కళాజాతా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మన లావాదేవీలు, బ్యాంకు ఖాతాలకు సంబంధించి వచ్చే ఐవీఆర్ కాల్స్‌కు స్పందించకపోడం ఉత్తమం అన్నారు. అనుమానం వస్తే తక్షణమే సంబంధిత బ్యాంక్ బ్రాంచ్, బ్యాంకు హెల్ప్‌లైన్ నెంబరుకు ఫోన్ చేయాలని మేనేజర్ నరేష్‌బాబు తెలిపారు.

ఫుడ్ కమిషన్ చైర్మన్ తనిఖీలు

కందుకూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పామూరు రోడ్డులోని కస్తూర్భాగాంధీ బాలికా విద్యాలయం, జడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కేజీబీవీ, ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. కేజీబీవీలపై తనకు అనేక ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్న ఆయన ప్రత్యక్షంగా చూసి బాగుందనటం వెనుక ఆయన పర్యటన లీకు అవటమే కారణమన్న అభిప్రాయం వ్యక్తమైంది.

మామిడిలో పూత, పిందె దశ కీలకం

ఉలవపాడు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కందుకూరు కృషి విజ్ఞాన్ కేంద్రం సీనియర్ సైంటిస్ట్ ప్రసాద్‌బాబు మంగళవారం చాగొల్లు మామిడి రైతులకు మండల ఉద్యానఅధికారి జ్యోతి ఆధ్వర్యంలో ఒకరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. మామిడి సాగులో పూత.. పిందె దశ ఎంతో కీలకం అని సస్యరక్షణ పద్ధతులు పాటించి సంరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో అనంతరం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ అండ్ పీడీ ఏపీఎంఐపీ శ్రీనివాసులు, పెరియవరం సీనియర్ సైంటిస్ట్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

- కలిగిరి : పొగాకు వేలం కేంద్రం పరిధిలోని కృష్ణారెడ్డిపాలెం, శెట్టిపాలెం, ఆదిమూర్తిపురం, తూర్పుజంగాలపల్లిలో మంగళవారం బోర్డు అధికారులు క్షేత్రస్థాయి పర్యటన చేపట్టారు. కార్యక్రమంలో బోర్డు అధికారులు మహేష్‌కుమార్, శివకుమార్, ఐటీసీ, జీపీఐ కంపెనీ ప్రతినిధులు వెంకట్రావు, ఉన్నం శ్రీనివాసరావ పాల్గొన్నారు.
- మర్రిపాడు: డీసీపల్లి వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ జాలయనగరం, నెల్లూరుపాలెం, రావులకొల్లు, డీసీపల్లి గ్రామాల్లో పొగాకు పంటలను, క్యూరింగ్‌ను పరిశీలించారు. రైతులు అనుమతికి మించి పొగాకు పండించటమేకాక ఇప్పటికీ కూడా నాట్లు వేస్తుండడంతో నష్టపోయేందుకు అవకాశం ఉందన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):కోళ్ల వ్యాధులపై పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి రామవేంద్రశర్మ అన్నారు. మంగళవారం మాట్లాడుతూ తలవాపు, నల్లబడడం, మేత తినకపోడం లక్షణాలు కనిపిస్తే పశువైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. .

గ్రామాల అభివృద్ధి

ఉదయగిరి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పాలనలో అన్నిరంగాల్లో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని బీజేపీ మండల అధ్యక్షుడు చెన్నయ్య పేర్కొన్నారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో ఆయన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోదీ ప్రవేశపెట్టిన పథకాలను మారుమూల గ్రామాలకు అందేలా పని చేయాలన్నారు. బీజేపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కష్టపడాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఆవుల రోశయ్య, చల్లా సుబ్బరత్నం, కార్తీక్, ఖాజానాయబ్ రసూల్, శానంపూడి నరసయ్య, రాంనరేష్, షాజహాన్ పాల్గొన్నారు.

భూమి ఒకటే.. ఇద్దరికి పట్టాలు, భూరికార్డులు

- లింగసముద్రం నుంచే ఎక్కువ అర్జీలు
- కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ

లింగసముద్రం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఒకే భూమికి ఇద్దరికి పట్టాలు, రికార్డులు ఉండటం, అలాగే రికార్డుల్లో కూడా వేర్వేరు పేర్లు ఉండటం లాంటి డూప్లికెట్ అర్జీలు వస్తున్నాయని కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ తెలిపారు. మంగళవారం ఆమె స్థానిక తహీల్దారు కార్యాలయాన్ని తనిఖీ చేసి తహసీల్దార్ సీతామహాలక్ష్మి, వీఆర్‌ఓలు, సర్వేయర్లను పలు రెవెన్యూ సమస్యల గురించి ప్రశ్నించారు. కందుకూరులో ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఈ మండలం నుంచే ఎక్కువగా ఇలాంటి డూప్లికెట్ అర్జీలు వస్తున్నాయని, అధికారులు జాగ్రత్తగా రికార్డులు, భూములను పరిశీలించి ధృవపత్రాలు ఇవ్వాలన్నారు. అలాగే వీఆర్.కోటలో జరిగే రీసర్వే గురించి వీఆర్‌ఓలు, సర్వేయర్లతో మాట్లాడారు. పొలంలో ఎవరుంటే వారి పేర్లను రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. ఎలాంటి తేడాలు రాకుండా సర్వే చేయాలన్నారు. ఈ సందర్భంగా ముత్యాలపాడు ఒట్టిగుంట రమణయ్య సబ్ కలెక్టర్‌తో మాట్లాడారు. తన తన బంధువు శ్రీనివాసులుకు చెందిన 3ఎకరాలకు పైగా ఉన్న మామిడి తోట ఉందని దాన్ని పెదపవని మాల్యాద్రి 3ఏళ్ల కిందట తన భార్య, కుమారుడి పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని విన్నవించారు. లింగసముద్రంకు చెందిన మరొకరు కూడా ఇలాంటి సమస్యనే ఆమె దృష్టికి తెచ్చారు. తగిన చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ రమణయ్య పాల్గొన్నారు.



సమస్య వింటున్న సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ

గీత కులాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్

కావలి రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గీత కులాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన కావలి, బోగోలు, జలదంకి మండలాల గీతకులస్థులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎక్సైజ్ అధికారి శ్రీనివాసులునాయుడు మాట్లాడారు. మద్యం దుకాణాలపై ప్రత్యేక రిజర్వేషన్ కల్పిస్తూ లైసెన్స్ ఫీజులో 50శాతం రాయితీ ఇస్తూ నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. జిల్లాకు 18మద్యం షాపులు వచ్చాయన్నారు. ఆసక్తి ఉన్నవారు మద్యం దుకాణాల కోసం బుధవారం సాయంత్రం 5గంటలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కర్నూలు హైకోర్టు బెంచ్‌లో నెల్లూరును చేర్చొద్దు

కందుకూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కర్నూలులో ఏర్పాటు చేయనున్న హైకోర్టు బెంచ్‌లో నెల్లూరు, ప్రకాశం జిల్లాలను చేర్చటం సమంజసం కాదని ఈ రెండు జిల్లాలను అమరావతి హైకోర్టు పరిధిలోనే ఉంచాలని కందుకూరు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సన్నెబోయిన శ్రీనివాసులునాయుడు మంగళవారం ఓ ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు సిద్ధం కావటం హర్షించదగ్గ పరిణామం అని పేర్కొన్నారు. అయితే కర్నూలు బెంచ్ పరిధిలోకి ప్రకాశం, నెల్లూరు జిల్లాలను కలపటం ఏమాత్రం ఆమోదనీయం కాదన్నారు. కందుకూరు నుంచి కర్నూలుకు 300 కిలోమీటర్ల దూరం ఉందని, అదే అమరావతి హైకోర్టుకు కేవలం 180 కిలో మీటర్లు మాత్రమే అన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం తక్షణం పునరాలోచన చేసి ఈ రెండు జిల్లాలను కర్నూలు బెంచ్ నుంచి మినహాయించాలని కోరారు.

వైభవంగా గంధమహోత్సవం

ఉదయగిరి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చింతల్‌లో వెలసిన అబ్దుల్ వహబ్ సాహెబ్ గంధమహోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హక్కుదారుల ఇంటి నుంచి గంధాన్ని ఫకీరు జరుబులు, బాణసంచా పేలుళ్ల మధ్య పట్టణ వీధుల్లో ఊరేగింపుగా దర్గాకు చేర్చారు. చదివింపుల అనంతరం గంధాన్ని భక్తులకు పంచిపెట్టారు. గంధమహోత్సంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొని, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే నయం చేయొచ్చు

వింజమూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):స్థానిక మాశిలామణి వైద్యశాలలో మంగళవారం ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని నిర్వహించారు. విశ్రాంత డీఎంహెచ్‌వో మాశిలామణి రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేసి మాట్లాడారు. కేన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధులపై అవగాహన పెంపొందించుకోవడం సమాజానికి చాలా అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రశాంత్, హబ్సిబా, మల్లికార్జున్, శాలిని, కీర్తన, సుజిత్, తిరుమలేష్, తదితరులు పాల్గొన్నారు.

- ఉదయగిరి:అప్పసముద్రం హెల్త్ క్లీనిక్ కేంద్రంలో వైద్యాధికారి వినీత అవగాహన కల్పించారు. కేన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే నయం చేయవచ్చన్నారు. ఇందులో భాగంగా తమ సిబ్బంది ఇంటింటిని సందర్శించి కేన్సర్ సర్వే నిర్వహిస్తున్నారని పేర్కొనారు. అనంతరం సీహెచ్‌సీ పాత భవనంలో ఆశా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈనెల 10న జరిగే డీవార్మింగ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.
- కావలి: ఆధునిక జీవనశైలితో వస్తున్న క్యాన్సర్‌ను జయిద్దామని డిప్యూటీ డీఎంహెచ్‌వో బ్రిజిత తెలిపారు. స్థానిక కార్యాలయంలో క్యాన్సర్‌ను జయిద్దాం అంటూ ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. మద్యం, పొగ తాగటం, ఆహారపదార్థాలలో రంగులు వినియోగం, రసాయనాలు వాడటం, అధిక బరువు, కాలుష్యం, రేడియేషన్ తదితరాలు క్యాన్సర్‌కు కారకాలన్నారు. అనంతరం ఏరియా వైద్యశాలలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏరియావైద్యశాల సూపరింటెండెంట్ పద్మావతి, రెండో పట్టణ ఎస్ఐ కరీంలు పాల్గొని అవగాహన కల్పించారు.



రోగిని పరిశీలిస్తున్న డాక్టర్ మాశిలామణి

విచ్చలవిడిగా బెల్ట్ షాపులు

వింజమూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోనూ, మండలంలోని గ్రామాల్లోనూ విచ్చలవిడిగా మద్యం బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. ఎక్సైజుఅధికారులు చూసీచూడనట్లు ఉండడంతో మద్యం వ్యాపారం బాగా విస్తరిస్తోంది. గ్రామాల్లో బెల్ట్ షాపులు వల్ల ప్రజలపై ఆర్థిక భారంపడుతున్నది. అంతేకాక పరిసర ప్రాంతాల్లో అపరిశుభ్రంగా తయారవుతున్నాయి. గ్రామాల్లోని ఆలయాలు పాఠశాలలు, బస్‌షెల్టర్లు మందుబాబుల అడ్డాగా మారాయి. అలాగే పట్టణంలో అధిక ధరలకు మద్యం అమ్ముతూ ఆదాయం పొందుతున్నాడు. గ్రామాల్లో బెల్టు షాపుల వల్ల గొడవలు జరుగుతున్నాయని గ్రామీణులు అంటున్నారు. గత ప్రభుత్వంలో కంటే ఈ ప్రభుత్వంలోనే ఎక్కువ బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారని మండల వాసులు అంటున్నారు. వీటిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఆదర్శమూర్తి కందప్ప మేస్త్రి

● టీడీపీ నేత వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : అరణి కందప్ప మేస్త్రి చిరస్మరణీయులని, ఆయన సేవలు నేటి తరానికి ఆదర్శమని నారాయణ విద్యా సంస్థల జనరల్ మేనేజర్, టీడీపీ నాయకుడు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సంతపేటలోని కందప్ప మేస్త్రి సత్రంలో కందప్ప జయంతి జరిగింది. ఆయన విగ్రహానికి విజయ భాస్కర్ రెడ్డి పూల మాల వేసి నివాళులర్పించారు. కందప్ప జయంతి సందర్భంగా రైల్వే స్టేషన్, బస్టాండ్ ప్రాంతాల్లో నడువలేని వృద్ధులకు వీల్‌చైర్లు వితరణ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో దేవదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, సత్రం ఈవో అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, 47వ డివిజన్ కార్పొరేటర్ రామకృష్ణ, టీడీపీ నాయకులు కపిర శ్రీనివాసులు, కప్పిర రేవతి పాల్గొన్నారు.

మహిళపై దాడి

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మహిళపై దాడిచేసి గాయపరిచిన ఘటనపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని చాకలవీధికి చెందిన ఓ మహిళ వరుణ్ అనే వ్యక్తితో సహజీవనం చేస్తోంది. కొద్ది రోజులుగా వరుణ్ మద్యం మత్తులో నగదు కోసం ఆమెతో గొడవ పడుతున్నాడు. నగదు ఇవ్వకపోతే ఆమెపై దాడి చేయడం ప్రారంభించాడు. సోమవారం కూడా ఇలాగే చేయడంతో గాయపడ్డ బాధితురాలు మంగళవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని విమర్శించే అర్హత మీకెక్కడిది?

● కాకాణి, ప్రసన్నలను ప్రశ్నించిన టీడీపీ నేత ఎర్రంరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కోవూరు నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా అవినీతి, వివాదరహిత రాజకీయాలు చేస్తూ అభివృద్ధికి శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని విమర్శించే అర్హత మీకెక్కడిదని మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని పెన్నాడెల్టా మాజీ చైర్మన్ ఎర్రంరెడ్డి గోవర్ధన్ రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగర పంచాయతీ వైస్‌చైర్మన్ల ఎన్నికల్లో వైసీపీ కౌన్సిలర్లను ఎమ్మెల్యే ప్రలోభపెట్టారని చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. ఎన్టీఆర్‌కు నచ్చజెప్పి కోవూరు టికెట్టు ఇప్పించి గెలిపించిన చంద్రబాబును వంచించి లక్ష్మీపార్వతి చెంతకు వెళ్లిన నీకు మరోసారి టీడీపీలో స్థానం కల్పించగా 2009లో టీడీపీ నుంచి మేము డబ్బులు ఖర్చు పెట్టి గెలిపిస్తే నెల తిరిగేలోపే కాంగ్రెస్‌లో రాజశేఖర్‌రెడ్డి పంచన చేరి సిగ్గులేని రాజకీయాలు చేసిన నువ్వా ఎమ్మెల్యే వేమిరెడ్డిని విమర్శించేది అని ప్రసన్నపై మండిపడ్డారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డికి నచ్చజెప్పి జడ్పీ చైర్మన్‌ను చేసి రాజకీయ భిక్ష పెట్టిన ఆనం రామనారాయణరెడ్డికి వెన్నుపోటు పొడిచిన నువ్వా ఎమ్మెల్యే వేమిరెడ్డిని విమర్శించేది అని కాకాణిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు ప్రత్యూష, నస్రీన్, శివకుమార్‌రెడ్డి, కళ్యాణ్, వైష్ణవి, చాందినీ, మల్లారెడ్డి, టీడీపీ నేతలు హరికృష్ణ, ఎంవీ. శేషయ్య, వంశీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

తిరుమల రథసప్తమి వేడుకల్లో ప్రశాంతిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామికి మంగళవారం జరిగిన రథసప్తమి వేడుకల్లో కోవూరు ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొన్నారు. తెల్లవారుజామున నిర్వహించిన సూర్యప్రభ వాహన సేవలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, ఇతర బోర్డు సభ్యులతో కలిసి ఆమె పాల్గొన్నారు.



సూర్యప్రభ వాహన సేవలో ప్రశాంతిరెడ్డి

ఆకట్టుకున్న మహిళల కోలాట ప్రదర్శన

విడవలూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో మంగళవారం జరిగిన రథసప్తమి వేడుకల్లో విడవలూరు మండలం రామతీర్థంకు చెందిన మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహకారంతో శ్రీనివాస కోలాట బృందం నెల్లూరు ఆధ్వర్యంలో జరిగిన కోలాట ప్రదర్శనలో మహిళలు రాజ్యలక్ష్మి, శ్రీవాణి, ప్రీతి, మౌనిక, పల్లవి, అనూష, కళావతి, తదితరులు పాల్గొన్నారు. శ్రీవా రి ఆలయ ప్రాంగణంలో కోలాట ప్రదర్శనకు అవకాశం కల్పించిన ఎమ్మెల్యేకి కోలాట నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు.



తిరుమల శ్రీవారి ఆలయ ప్రాంగణంలో కోలాటం వేస్తున్న విడవలూరు మహిళలు

రైతులకు ప్రభుత్వ చేయూత : గిరిధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్ : రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలం లోని ఆమంచర్ల గ్రామంలో గడప గడప కార్యక్రమం నిర్వహిం చారు. ఇంటింటికి వెళ్లి స్థానిక సమస్యలు తెలుసుకు న్నారు. వరి, ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసే రైతులకు రాయితీపై ఎరువులు అందిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయానికి విద్యుత్ సమస్యను పరిష్కరించామని చెప్పారు.

డీఏవై మిషన్ అమలు ఎలా ఉంది?

● పార్లమెంటులో ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : దీనదయాళ్ అంత్యోదయ యోజన-జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ (డీఏవై-ఎన్ ఆర్‌ఎల్‌ఎం) పథకం నెల్లూరు జిల్లాలో అమలు తీరు ఎలా ఉందని పార్లమెంటులో మంగళవారం నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. ఇందుకు కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చింది. ఆ మిషన్ కింద జిల్లాలో 37 రూరల్ బ్లాక్‌లు ఉన్నాయని, వాటన్నింటిలో మిషన్ అమలవుతోందని తెలిపారు. ఈ మిషన్ కింద ఆంధ్రప్రదేశ్‌కు గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో రూ.756 కోట్లను కేంద్రం కేటాయించిందని వివరించారు.

రాష్ట్రంలో రైల్వేల అభివృద్ధికి పెద్దపీట

రాష్ట్రంలో రైల్వేల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్ద పీట వేసి భారీగా నిధులు కేటాయించటం హర్షణీయమని ఎంపీ వేమిరెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.103 కోట్లు ఖర్చుచేస్తున్నార న్నారు. రాష్ట్రానికి మరిన్ని వందేభారత్ రైళ్లు కేటాయిస్తామని కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్ చెప్పటంపై హర్షం వ్యక్తం చేశారు.

వైభవంగా రథసప్తమి వేడుకలు



బుచ్చిలో సూర్యప్రభ వాహనంపై కొలువుదీరిన కోదండరాముడు



సూర్యప్రభ వాహనంపై కల్యాణ వేంకటేశ్వరుడు



చప్పరంపై ఊరేగుతున్న వరదరాజస్వామి

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రథసప్తమి వేడుకలు మంగళవారం వైభవంగా జరిగాయి. బుచ్చిరెడ్డిపాళెం పెద్దూరులో కోదండ రామస్వామి ఆలయం, రామకృష్ణానగర్‌లో కల్యాణ వేంకటేశ్వరస్వామి సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. జొన్నవాడలో శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజస్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం ప్రాతఃకాలంలోనే స్వామి, అమ్మవార్లకు అభిషేకములు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలను తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. జొన్నవాడ పెన్నానదిలో తల, భుజాలపై జిల్లేడు ఆకులు పెట్టుకుని స్నానాలు చేసి సూర్య భగవానుడికి నీరు సమర్పించారు.

● కోవూరు : స్థానిక గుమ్మళ్లదిబ్బ కాలనీలో ఇటీవల నెలకొల్పిన భవానారుషి ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భావనారాయణ, భద్రావతుల కల్యాణం శాస్త్రోక్తంగా జరిపించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ పార్లమెంటు కమిటీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, బీసీ నాయకుడు టీవీ శేషయ్య పాల్గొన్నారు.

ప్రాణాంతక క్యాన్సర్‌పై అవగాహన కల్పించాలి



వెంకటాచలం : క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీలో వీసీ విజయభాస్కర్‌రావు, తదితరులు



మెడికవర్ ఆసుపత్రిలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తదితరులు

● వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ విజయభాస్కర్‌రావు

వెంకటాచలం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని వీసీ ప్రొఫెసర్ విజయభాస్కర్‌రావు సూచించారు. మండలంలోని విక్రమ సింహపురి యూనివర్సిటీలో మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్, పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వారు సంయుక్తంగా ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధులపై అవగాహన పెంపొందించడం సమాజానికి చాలా అవసర మన్నారు. విద్యార్థులు సమాజంలో క్యాన్సర్ పట్ల సరైన అవగాహన కల్పించడంలో ముందుండాలని పిలుపునిచ్చారు. అనంతరం క్యాన్సర్‌పై అవగాహన కల్పించే పోస్టర్లు, ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, వైద్యనిపుణులు డాక్టర్ కే వరుణ్ ప్రకాష్, డాక్టర్ జీ హరిప్రియ, ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త డాక్టర్ అల్లం ఉదయ్‌శంకర్, పీఎంపీ జిల్లా అధ్యక్షుడు ఎస్ వేణుగోపాల్, జయ ప్రకాష్, డాక్టర్ బీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలోని నారాయణ రూరల్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ వద్ద మంగళవారం ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ నర్సింగ్ కళాశాల విద్యార్థులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రూరల్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కే విద్యాసాగర్ పాల్గొని క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నారాయణ వైద్యశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్‌కు అవగాహన

నెల్లూరు(విద్య): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో మంగళవారం వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంకాలజిస్టులు డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ హరికాంత్ హాజరై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వయసు పెరిగే కొద్దీ ఆహార అలవాట్లలో మార్పురావాలని, ప్రధానంగా పొగతాగడం, ఆల్కహాల్, పొగాకు ఉత్పత్తులు నమలడం వంటి అలవాట్లను మానుకుంటే చాలావరకు కేన్సర్ దరి చేరదని సూచించారు. మహిళలు బరువు పెరిగితే బ్రెస్ట్ కేన్సర్‌కు గురవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర, కోశాధికారి జీకే గోపీనాథ్, సభ్యులు పాల్గొన్నారు.

క్యాన్సర్ నివారణకు కృషి

నెల్లూరు(వైద్యం): దేశ వ్యాప్తంగా క్యాన్సర్ మహమ్మారి నివారణకు అపోలో ఆసుపత్రి వైద్యులు కృషి చేస్తున్నారని నెల్లూరులోని అపోలో ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీరాం సతీష్ వెల్లడించారు. ఆసుపత్రిలో మంగళవారం ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్, ఇండియన్ మెడికల్ అసోసియేష న్ సభ్యులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఒకప్పుడు గుర్తించలేని స్థాయి నుంచి నేడు అన్ని రకాల క్యాన్సర్లను వైద్యులు గుర్తించి చికిత్సలు అందిస్తున్నారని చెప్పారు. అపోలో ఆసుపత్రులలో వైద్య నిపుణులు అత్యుత్తమ వైద్య చికిత్సలు అందిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంకాలజిస్ట్ డాక్టర్ హరిత, డాక్టర్ మనోభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

మెడికవర్‌లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు : నుడా చైర్మన్

నగరంలోని మెడికవర్ ఆసుపత్రిలో క్యాన్సర్ నిర్ధారణకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. మంగళవారం ఆసుపత్రిలో స్క్రీనింగ్ పరీక్షల పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను ఈ నెల 28వ తేదీ వరకు ఉచితంగా నిర్వహించటం అభినందనీ యమన్నారు. ఆసుపత్రి హెడ్ డాక్టర్ బిందు రెడ్డి మాట్లాడుతూ రూ.3 వేల విలువైన క్యాన్సర్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్యాపిస్మియర్, మామోగ్రఫీ పరీక్షలతో పాటు డాక్టర్ కన్సల్టేషన్ ఉచితంగా ఉంటుందని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో చందువర్మ తదితరులు పాల్గొన్నారు.

జగదేవిపేటలో 'ఆశా డే'



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఇందుకూరుపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిషోర్‌కుమార్, డాక్టర్ బ్రహ్మేశ్వరనాయుడు ఆధ్వర్యంలో మంగళవారం ఆశా డే కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య కార్యక్రమాల గురించి, క్యాన్సర్ వ్యాధి గురించి అవగాహన కల్పించారు. అలాగే జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో డాక్టర్ కిషోర్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, హెల్త్ సూపర్‌వైజర్ రమా, సతీష్‌బాబు, ఫార్మసీ ఆఫీసర్ చంద్రశేఖర్, వైద్య సిబ్బంది, ఆశా వలంటీర్లు పాల్గొన్నారు.

ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించండి

● తహసీల్దార్‌కు విడవలూరు, కొడవలూరు మండలాల రైతుల వినతి

కొడవలూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో పెరిగిన పెట్టుబడులకు అనుగుణంగా వరి ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ మంగళవారం విడవలూరు, కొడవలూరు మండలాలకు చెందిన రైతులు స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అనంతరం తహసీల్దారు స్ఫూర్తిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వరి సాగుకు ఎకరాకు రూ.40వేల వరకు పెట్టుబడులు అవుతున్నాయని, ప్రభుత్వం అందించే గిట్టుబాటు ధర నామమాత్రంగా ఉందని ఆరోపించారు. దీనివల న రైతులు తీసుకున్న అప్పులు, దానికి వడ్డీ కట్టలేక నానా ఇబ్బందులు పడడమే కాకుండా, ఆస్తులు అమ్ముకునే పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలన్నారు. ఈ ఆందోళనలో రైతులు పోలిరెడ్డి అశోక్‌రెడ్డి, గల్లా శ్రీకాంత్, గల్లా చెంచయ్య, తూము మాధవ, కొమ్మిరెడ్డి కోటారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విడవలూరు, కొడవలూరు రైతులు

డ్రగ్స్‌తో అనర్థాలు

● ఎస్వీ గ్రూప్ విద్యాసంస్థల చైర్మన్ గుణశేఖర్

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): యువత డ్రగ్స్ తీసు కోవటం ఆరోగ్యానికి అనర్థదాయకమని ఎస్వీ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పీ గుణశేఖర్ అన్నారు. మంగళ వారం శ్రీవెంకటేశ్వర ఇంజనీరింగ్ కాలే జీలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ అవగాహన సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ కు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కోవూరు సీఐ సురేంద్ర, రాజుపాళెం ఎస్ఐ నీకే కోటిరెడ్డి, ఏపీ యువజన సర్వీసుల శాఖ సీఈవో నాగేశ్వరరావు, మేనేజర్ శ్రీనివాసరావు, సైకాలజిస్టు డాక్టర్ సురేంద్రబాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు మిషాల్

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్రలోని శంభాజీ నగర్‌లో ఈనెల 13 నుంచి జరగనున్న ఎస్‌జీఎఫ్ అండర్-14 జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు నగరంలోని ఫత్తేఖాన్‌పేట రవీంద్రభారతి పాఠశాల విద్యార్థి షేక్ మిషాల్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి వై శ్రీహరి మాట్లాడుతూ తమ విద్యార్థి జాతీయ పోటీలకు ఎంపికవడం ఆనందంగా ఉందని, జాతీయ పోటీల్లో కూడా ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీ వంశీ, పీఈటీ డీ వంశీ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



మిషాల్‌ను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్య ప్రతినిధులు

7న చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయండి

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఈనెల 7న జరిగే చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలని ఎమార్పీఎస్ జాతీయ నాయకుడు శ్రీనివాసమాదిగ పిలుపునిచ్చారు. ఈమేరకు మంగళవారం బుచ్చి తహసీల్దారు కార్యాలయం వద్ద పోస్టర్ ఆవిష్కరించి కార్యాలయం గోడకు అంటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు మేరకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఎస్సీ వర్గీకరణ అమలులో మొదట స్థానంలో ఉంటామని ప్రకటించి 4నెలలు పూర్తయినా ఎస్సీ వర్గీకరణ అమలుకు నోచుకోలేదన్నారు. దీంతో హైదరాబాద్‌లో లక్షల డప్పులతో 15 రాష్ట్రాల నుంచి వచ్చే మాదిగలతో భారీ సాంస్కృతిక ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దర్శిగుంట శ్రీనివాసులు, కావలి శ్రీనివాసులు, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దారు కార్యాలయం గోడకు పోస్టర్ అంటిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆ కార్పొరేటర్లపై అనర్హత వేటు వేయండి

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగర డిప్యూటీ మేయర్ ఎన్నికలో పార్టీ విప్‌ను ఉల్లంఘించిన వైసీపీ కార్పొరేటర్లపై అనర్హత వేటు వేయాలని కోరుతూ వైసీపీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వత రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం జాయింట్ కలెక్టర్ కార్తీక్‌కు ఆయన చాంబర్‌లో వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్ అహ్మద్, హంజా హుస్సేని, కార్పొరేటర్లు కరీముల్లా, ఉమామహేష్ తదితరులు పాల్గొన్నారు.



జేసీ కార్తీక్‌కు వినతిపత్రం అందచేస్తున్న చంద్రశేఖర్ రెడ్డి, కార్పొరేటర్లు

నేత్రదానం

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బాలాజీ నగర్‌కు చెందిన పద్మిని(70) మంగళవారం స్వగృహంలో మృతిచెందారు. సింహపురి దేహసమర్పణ సంస్థ కన్వీనర్ విజయ్ సహకారంతో కుటుంబ సభ్యులు నేత్రదానం చేశారు. జీజీహెచ్, ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్లు సునీల్, ప్రసాద్ ఆమె నేత్రాలు సేకరించారు.

బడ్జెట్‌లో చేనేతలకు నిరాశ

నెల్లూరు(వ్యవసాయం), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో చేనేతలకు కేవలం రూ.200కోట్లు కేటాయిండం బాధాకరమని చేనేత ఐక్యకార్యాచరణ కమిటీ అధ్యక్షుడు బుధవరపు బాలాజీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎక్కువ మొత్తంలో నిధులు కేటాయించి, ఉపాధి అవకాశాలు కల్పిస్తారని ఎదురుచూసిన నేతన్నలకు నిరాశే మిగిలిందని తెలిపారు. చేనేతలను ఆదుకునేందుకు మరికొంత నిధిని కేటాయించే లా రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి చొరవ తీసుకోవాలని ఆయన కోరారు.

సాయం ముసుగులో మోసం

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సాయం ముసుగులో ఓ వృద్ధుడిని మోసం చేసి నగదు దోచుకెళ్లిన ఘటనపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని ముత్యాలపాళేనికి చెందిన దేవదాసు అనే వృద్ధుడు మంగళవారం తన ఏటీఎం కార్డు పిన్ నెంబరు మార్చుకునేందుకు బారకాస్‌లోని ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రానికి వెళ్లారు. గుర్తుతెలియని వ్యక్తి అతనితో మాటలు కలిపి ఏటీఎం పిన్ మార్చి ఇస్తానని నమ్మబలికి దేవదాసు ఏటీఎం కార్డు తీసుకున్నారు. పని పూర్తయ్యిందని చెప్పి ఆయన ఏటీఎం కార్డు బదులు నకిలీ ఏటీఎం కార్డు ఇచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. దేవదాసు ఏటీఎం మిష న్‌లో కార్డును పెట్టగా అతనిది కాదని తేలింది. దీంతో ఆయన గుర్తు తెలియని వ్యక్తి కోసం గాలిస్తుండగానే తన బ్యాంకు ఖాతా నుంచి రూ.34 వేలు నగదు డ్రా అయినట్లు ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. మోసపోయానని భావించిన బాధితుడు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

న్యూస్ బాక్స్

బాలికల వసతిగృహం పరిశీలన

కోవూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఫుడ్ కమిటీ చైర్మన్ సీహెచ్ విజయప్రతాప్ రెడ్డి మంగళవారం స్థానిక బాలికోన్నత పాఠశాల ఆవరణలోని బాలికల వసతి గృహాన్ని పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం సక్రమంగా అందించకుంటే మేట్రిన్లపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం పీఆర్‌ఆర్ కాలనీలోని 46వ నెంబరు రేషన్‌షాపును పరిశీలించి డీలరుకు తగు సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దారు నిర్మలానంద బాబా ఉన్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోండి

కోవూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కోవూరు, కొడవలూరు, విడవలూరు మండలాల పరిధిలోని గౌడ కులాల వ్యక్తులు జిల్లాలో కేటాయించిన దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ షేక్ మహబూబ్‌బాషా కోరారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ దరఖాస్తు దారులు కుల, నివాస ధ్రువీకరణ పత్రాలను తహసీల్దారు కార్యాలయాల్లో తీసుకుని ఆన్‌లైన్ విధానం ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు రుసుం రూ.2లక్షలు చెల్లించి బుధవారం సాయంత్రంలోగా తమ కార్యాలయానికి అందచేయాలన్నారు.

గురుకుల పాఠశాలలో సరస్వతి పూజ

వెంకటాచలం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొలగమూడి సమీపంలో ఉన్న మహాత్మ జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం సరస్వతి పూజ ఘనంగా జరిగింది. పాఠశాల ప్రిన్సిపాల్ వీవీ రమణప్రసాద్ మాట్లాడుతూ పదవ తరగతి చదువుతున్న విద్యార్థినులు రానున్న పబ్లిక్ పరీక్షలలో మంచి ఫలితాలతో ఉత్తీర్ణత సాధించాలని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'నారాయణ ఫార్మసీ'లో ప్రాంగణ ఎంపికలు

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నారాయణ ఫార్మసీ కళాశాలలో మంగళవారం ప్రాంగణ ఎంపికలు జరిగాయి. తిరుపతికి చెందిన ఏజీఎస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో ఉద్యోగాల కోసం ఈ ఎంపికలు నిర్వహించారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా 39 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుజాత, ప్లేస్‌మెంట్ అధికారి భరత్‌కుమార్, ఏజీఎస్ సంస్థ మేనేజర్ రాజేష్, సభ్యులు సందీప్, శివ పాల్గొన్నారు.

'రత్నం'లో సూర్య నమస్కారాలు


నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : రథసప్తమి పర్వదినం సందర్భంగా నగరంలోని సరస్వతినగర్ డాక్టర్ కిషోర్స్ రత్నం పాఠశాలలో మంగళవారం విద్యార్థులు సూర్యనమస్కారాలు చేశారు. ప్రణామాసనము, అశ్వసంచాలానాసన, భుజంగాసన తదితర నమస్కారాలు చేస్తూ వాటి ప్రాముఖ్యతను తెలియచేశారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల జీఎం రామ్మూర్తినాయుడు, మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాళ్లు మణిమాల, ప్రపూర్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెన్నుతీసే ముందు పొటాష్, యూరియా పిచికారీ చేయండి

మనుబోలు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): వరిపైరు వెన్నుతీసే సమయంలో చివరి సారిగా 25 కేజీల పొటాష్‌తో 50 కేజీల యూరియా కలుపుకుని పిచికారి చేయాలని ఏడీఏ శివనాయక్ అన్నారు. మండలంలోని కాగితాలపూరు సచివాలయంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొటాష్‌తో పాటు యూరియా కలిపి పిచికారి చేస్తే ఎక్కువ పిలకలు పెరగడమే కాకుండా, వరికంకి పాలుపోసుకునేందుకు సహకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జహీర్, వీఏఏ తేజస్వీ, రైతులు పాల్గొన్నారు. అలాగే స్థానిక శ్రీరవి ఫర్టిలైజర్స్ ఆధ్వర్యంలో మనుబోలులో తెగుళ్లపై నిచినో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ జాతీయ మార్కెటింగ్ అధికారి ఉప్పు గిరీష్ రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నిచినో ఆర్‌ఎంఎం. శ్రీనువాసులు రెడ్డి, ఫర్టిలైజర్స్ నిర్వాహకులు దామిశెట్టి రంగారావు పాల్గొన్నారు.

కసుమూరులో ఉచిత వైద్య శిబిరం

వెంకటాచలం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కసుమూరు మస్తాన్ వలీ దర్గా వద్ద మంగళవారం సీజనల్ వ్యాధులపై ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యురాలు సరళ భక్తులకు, స్థానికులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఆయుర్వేద మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరాన్ని దర్గా కేర్ టేకర్ పఠాన్ అస్లాం ఖాన్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి సయ్యద్ అన్వర్ తదితరులు పాల్గొన్నారు.


తిరుమలలో సూర్యప్రభ వాహనంపై మలయప్పస్వామి


మంగళవారం ఉదయం సూర్యప్రభ వాహనంపై మలయప్పను దర్శించుకోవడానికి తరలివచ్చిన భక్తజనం


సూర్యప్రభపై తిరుపతిలోని గోవిందరాజస్వామి

అంగరంగ వైభవం
అర్ధ బ్రహ్మోత్సవం

- వివరాలు 6వ పేజీలో -

సప్తవాహనసేవల ఊరేగింపులతో సప్తగిరులు పులకించిపోయాయి. వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, గోవిందనామస్మరణలు, కర్పూరహారతులు, భజన, నృత్య, వాద్య బృందాల ప్రదర్శనలతో నాలుగు మాడవీధులు మారుమోగాయి. మంగళవారం తిరుమలలో రథసప్తమి సంబరాలు అంబరాన్నంటాయి. చీకటి తెరలు వీడకముందే తెల్లవారుజామునే ఏడుకొండల స్వామి సూర్యప్రభపై బయలుదేరాడు. ఒక్కో వాహనం మీద, ఒక్కో అలంకారంలో రాత్రి దాకా భక్తులకు కనువిందు చేశాడు. చలినీ, ఎండనూ లెక్కచేయకుండా లక్షలాది మంది భక్తులు మాడవీధుల్లో శ్రీనివాసుడి దర్శనం కోసం పరితపించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

డిప్యూటీ మేయర్
సైకిల్ వశం

కూటమి తరపున టీడీపీ అభ్యర్థి ఆర్సీ మునికృష్ణ విజయం

● వైసీపీకి 21, టీడీపీకి 27 మంది మద్దతు ● ఒకరు తటస్థం, ఇద్దరు గైర్హాజరు

తిరుపతి, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఎన్నికపై ఉత్కంఠ వీడింది. 35వ డివిజన్ టీడీపీ అభ్యర్థి ఆర్సీ మునికృష్ణ డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ప్రకటించారు. టీడీపీ అభ్యర్థి మునికృష్ణకు 26 మంది, వైసీపీ అభ్యర్థి లడ్డు భాస్కర్‌రెడ్డికి 21 మంది మద్దతు తెలిపారు. సోమవారమే డిప్యూటీ మేయర్ ఎన్నిక జరగాల్సి ఉండగా, తగిన కోరం లేకపోవడంతో ఎన్నికను మంగళవారం తిరిగి నిర్వహించారు.

సోమవారం నాటి హైడ్రామా సంఘటనలతో ఎన్నికల్లో టెన్షన్ తప్పదని అందరూ భావించారు. అయితే ప్రశాంతంగా డిప్యూటీ మేయర్ ఎన్నిక జరిగిపోయింది. మొదట ఎంపీ గురుమూర్తితో కలిసి 22 మంది వైసీపీ సభ్యులు బస్సులో సెనేట్ హాలుకు చేరుకున్నారు. ఆ తర్వాత ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు 26 మంది కార్పొరేటర్లతో హాజరయ్యారు. ప్రత్యేక కౌన్సిల్ రిజిస్టర్‌లో సంతకాలు చేసి వారికి కేటాయించిన సీట్లలో కూర్చున్న తర్వాత ఎన్నికల అధికారి శుభం భన్సల్ ఎన్నిక ప్రక్రియను ప్రారంభించారు. వైసీపీ అభ్యర్థి లడ్డూ భాస్కర్‌రెడ్డిని మేయర్ డాక్టర్ శిరీష, ఆదం రాధాకృష్ణారెడ్డి బలపరచగా, టీడీపీ అభ్యర్థి ఆర్సీ మునికృష్ణను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, అన్నా అనిత పైకి లేచి బలపరిచారు. అభ్యర్థులకు చేతులెత్తి మద్దతు తెలపాలని ఎన్నికల అధికారి సూచించారు. ముందుగా వైసీపీ అభ్యర్థి పేరు చెప్పగా 21 మంది సభ్యులు చేతులెత్తారు. ఆతర్వాత టీడీపీ అభ్యర్థికి 26 మంది సభ్యులు చేతులెత్తి మద్దతు పలకడంతో ఆర్సీ మునికృష్ణ విజయం ఖరారైంది.

ఎన్నిక జరిగింది ఇలా...

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో 47 మంది కార్పొరేటర్లు, ముగ్గురు ఎక్స్‌అఫిషియో సభ్యులున్నారు. మొత్తం 50 మంది ఓటర్లుగా ఉండగా 48మంది ఎన్నికకు హాజరయ్యారు. ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా ఉన్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, 15వ డివిజన్ కార్పొరేటర్ షాలిని రెడ్డి గైర్హాజరయ్యారు.హాజరైనవారిలో 5వడివిజన్ కార్పొరేటర్ అమరనాథ్ రెడ్డి తటస్థంగా ఉండి ఎవరికీ మద్దతుతెలపలేదు.

వైసీపీ బృందంతో వచ్చి టీడీపీకి మద్దతు

వైసీపీ బృందం నుంచి వచ్చిన 22 మంది కార్పొరేటర్లలో 17వ డివిజన్ కార్పొరేటర్ రత్నకుమారి టీడీపీకి మద్దతు పలికారు. దీంతో వైసీపీ 21 ఓట్లకే పరిమితమైంది. అదేవిధంగా 5వ డివిజన్ కార్పొరేటర్ అమరనాథ్ రెడ్డి 26 మంది కూటమి బృందంతో కలిసి వచ్చినప్పటికీ ఎవరికీ మద్దతు తెలపకుండా మౌనంగా ఉండిపోయారు. దీంతో వైసీపీ బృందం నుంచి ఒక ఓటు కూటమికి వచ్చినప్పటికీ 26 మంది మద్దతు మాత్రమే మిగిలింది. ఇదిలా వుంటే రత్నకుమారి టీడీపీకి మద్దతు పలకడంపై కౌన్సిల్ హాలులోనే కొందరు వైసీపీ మహిళా కార్పొరేటర్లు తూలనాడారు. సమావేశం అనంతరం ఆమె విలపిస్తూ సొమ్మసిల్లి బయట సోఫాలో వాలిపోవడంతో కూటమి మహిళా కార్పొరేటర్లు ఆమెకు సపర్యలు చేసి ఓదార్చారు.

విప్ ట్రైమప్.. ఖంగుతిన్న వైసీపీ

డిప్యూటీ మేయర్ ఎన్నిక ప్రక్రియ ప్రారంభమవుతుండగా వైసీపీ తరపున విప్ జాబితా దరఖాస్తును ఎంపీ గురుమూర్తి, కార్పొరేటర్ ఆదం రాధాకృష్ణారెడ్డి ఎన్నికల అధికారికి అందజేయబోయారు. అయితే ప్రత్యేక సమావేశం 11 గంటలకు ప్రారంభమైందనీ, అంతకంటే ముందుగా ఇస్తేనే జాబితా తీసుకోవాలన్న నిబంధన ఉందని జేసీ చెప్పడంతో వారు ఖంగుతిన్నారు. విప్ జారీచేస్తే ప్రత్యర్థికి ఓటు వేసిన కార్పొరేటర్లు సభ్యత్వం కోల్పోయే అవకాశం ఉంటుంది. ఆ భయంతో అయినా తమకే ఓటు వేస్తారన్న వైసీపీ వ్యూహం బెడిసికొట్టింది.


డిప్యూటీ మేయర్ ఎన్నికలో కూటమి అభ్యర్థికి మద్దతుగా చేతులెత్తిన ఎమ్మెల్యే, కార్పొరేటర్లు

ఒక్కడుగా మొదలై డిప్యూటీగా ఎదిగి..



వైసీపీ హయాంలో నాలుగేళ్ల క్రితం జరిగిన తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో టీడీపీ నుంచి గెలిచిన ఏకైక కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ. అధికార బలంతో 26 డివిజన్లను ఏకగ్రీవం చేసుకుని 23 డివిజన్లను దౌర్జన్యంగా తన ఖాతాలో వేసుకుని సంబరాలు చేసుకున్న వైసీపీకి ఆర్సీ మునికృష్ణ ఒకే ఒక్కడిగా ఎదురునిలిచి టీడీపీ జెండా ఎగురవేశారు. కౌన్సిల్ సమావేశంలో వైసీపీ కార్పొరేటర్లు దాడికి దిగేటంత పనికి ఒడిగట్టినా, అప్పటి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి ఏక్ నిరంజన్ అంటూ హేళన చేసినా టీడీపీ తరపున తన గళాన్ని వినిపిస్తూనే వచ్చారు. పార్టీ పిలుపునిచ్చిన ప్రతికార్యక్రమంలోనూ తన దైన శైలిలో అప్పటి అధికార పక్షంపై విరుచుకుపడే ఆర్సీ మునికృష్ణ పోరాట ధీరత్వానికి ఫలితం ఇప్పుడు దక్కింది. ఆ ఒక్కడూ వటుడింతై.. అన్నట్టుగా ఏకంగా డిప్యూటీ మేయర్‌గా ఎన్నికయ్యారు.

రాజకీయ నేపథ్యమిదీ :1998లో టీడీపీలో చేరిన ఆర్సీ మునికృష్ణ 2004లో జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. 2009 నుంచి 2012 వరకు తిరుపతి నగర అధ్యక్షుడిగా పార్టీకి జవసత్వాలు నింపారు. ఆతర్వాత జిల్లా ఉపాధ్యక్షుడిగా కొనసాగారు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక గంగమ్మకు పరమభక్తుడైన ఆర్సీ 2017 నుంచి 2019 వరకు తాతయ్యగుంట గంగమ్మ ఆలయ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 2021లో 35వ డివిజన్ నుంచి టీడీపీ కార్పొరేటర్‌గా గెలిచి తాజాగా డిప్యూటీ మేయర్ కుర్చీని సాధించారు. కాగా తన గెలుపునకు సహకరించిన కూటమి నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేటర్లకు ధన్యవాదాలు తెలిపారు. తిరుపతి అభివృద్ధి కోసం కూటమి నాయకులతో కలసి పనిచేస్తామని 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు.



ప్రతి జిల్లాలో
క్యాన్సర్ డేకేర్ సెంటర్

● మూడేళ్లలో ఏర్పాటుకు కేంద్రం ప్రణాళిక ● వ్యాధి గుర్తించేందుకు పరీక్షలు నిర్వహిస్తున్నాం
● రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రాబోయే మూడేళ్లలో ప్రతి జిల్లాలో క్యాన్సర్ డేకేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని కేంద్రప్రభుత్వం ప్రణాళిక వేస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. తిరుపతిలో మంగళవారం ఆయన బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, నవీన్‌కుమార్‌రెడ్డి, కోలా ఆనంద్ తదితర నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో క్యాన్సర్ ద్వారా 9.93 శాతం మరణాలు సంభవిస్తున్నట్లు చెప్పారు. దీనిపై అవగాహన లేకపోవడం, ముందస్తు పరీక్షలు నిర్వహించి చికిత్స అందించకపోవడంతో ఈ పరిస్థితి వచ్చిందన్నారు. క్యాన్సర్ నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయన్నారు. 1500 బృందాలతో పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటికి 71 లక్షలమందికి క్యాన్సర్ పరీక్షలు నిర్వహించగా 66 వేలమంది అనుమానితులుగా తేలారన్నారు. వీరిని ప్రివెంటివ్ ఆంకాలజీ యూనిట్స్‌గా పరిగణిస్తున్న బోధనాస్పత్రులకు రెఫర్‌చేసి, మరోసారి పరీక్షలు నిర్వహించి క్యాన్సర్‌ను నిర్ధారిస్తామన్నారు. ఏ దశలో క్యాన్సర్ ఉందో గుర్తించి చికిత్స అందిస్తామన్నారు. 18 ఏళ్లు నిండిన మహిళలు రొమ్ము, సర్వైకల్ కాన్సర్ నిర్ధారణ పరీక్షలను చేయించుకోవాలని సూచించారు.

గత లోపాలను సరిదిద్దుతున్నాం

కూటమి అధికారంలోకి రావడంతో ఐదేళ్ల పీడకల నుంచి రాష్ట్రం బయట పడిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. 'గత ఐదేళ్లలో రాష్ట్రం 20 సంవత్సరాల వెనుక బడింది. ఆయా లోపాలను సరిదిద్దుకుంటూ ఈ ఐదేళ్లలో 15 సంవత్సరాలు రాష్ట్రం ముందుకెళ్లేలా అభివృద్ధి పనులు చేపట్టాం' అని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన వివరించారు. దార్శనికుడైన సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం గణనీయమైన అభివృద్ధి సాధిస్తుందన్నారు. దీనికి కేంద్రం సహకరిస్తోందని, బడ్జెట్‌లోనూ ప్రత్యేక కేటాయింపులు చేయడంతోపాటు ప్రాయోజిత పథకాలద్వారా రాష్ట్రానికి లబ్ధి చేకూరుస్తోందని చెప్పారు.



పుష్కరిణి వద్ద షెడ్డుకున్న పరదాలు - వాహన సేవలో బెదిరిన గజరాజు

గజరాజు ఘీంకారం

● తిరుచానూరులోని వాహన సేవలో బెదిరిన ఏనుగు

తిరుచానూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రథసప్తమి సందర్భంగా తిరుచానూరులో మంగళవారం ఉదయం సూర్యనారాయణ స్వామికి జరిగిన అశ్వవాహన సేవలో బెదిరిన గజరాజు ఘీంకరించింది. దీంతో భక్తులు ఆందోళన చెందారు. అమ్మవారి పుష్కరణిలో భక్తులు స్నానాలు ఆచరించాక దుస్తులు మార్చుకునేందుకు ఆలయం వెనుక తాత్కాలిక షెడ్లు వేశారు. వీటి చుట్టూ బ్లూరంగులో పరదా కట్టారు. అదే సమయంలో సూర్యనారాయణస్వామికి అశ్వవాహనసేవ సందర్భంగా గంగుండ్రమండపం వద్దకు వచ్చిన గజరాజు(శ్రీనిధి) ఆ షెడ్లకు చుట్టిన పరదా రంగును చూసి బెదిరింది. ఘీంకారం చేసింది. దీంతో భక్తులు, ఆలయాధికారులు ఆందోళన చెందారు. మావటిలు గజరాజును పక్కకు తీసుకెళ్లి సముదాయించారు. ఆ తర్వాత వాహన సేవల్లో యథావిధిగా గజరాజు పాల్గొంది.

మోడల్ ప్రాథమిక పాఠశాలల ఏర్పాటు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను బలోపేతం చేసే దిశగా మోడల్ పాఠశాలలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి అమలయ్యేలా చూడాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన డీఈవో కేవీఎన్ కుమార్‌తో కలిసి ఎంఈవోలకు పలు సూచనలు చేశారు. జిల్లాలో 130 క్లస్టర్లు ఉండగా.. ఒక్కోదానిలో 5నుంచి 10 వరకు పాఠశాలలు ఉంటాయన్నారు. ఆయా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, విద్యార్థుల సంఖ్యను బట్టి మోడల్ పాఠశాలలుగా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ మోడల్ స్కూల్‌లో ఐదుగురు ఉపాధ్యాయులు, 60మందికిపైగా విద్యార్థులు ఉంటారని వివరించారు. 60మంది విద్యార్థులకంటే తక్కువగా ఉన్న పాఠశాలలను బేసిక్ ఫౌండేషన్ పాఠశాలలుగా ఉంటాయన్నారు. గ్రామాల్లో బ్రిడ్జిలు దాటడం, 5 కిలోమీటర్లు ప్రయాణం చేసే విద్యార్థులకు రవాణా ఛార్జీలు చెల్లిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో బాలాజీ తదితరులు పాల్గొన్నారు.











వాహన సేవల ముందు కళాబృందాల ప్రదర్శన

పుష్కరిణిలో చక్రస్నాన ఘట్టం



ఏడు వాహనాలపై కొండల స్వామి





తిరుమల,ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): రథసప్తమి సంబరాలతో మంగళవారం తిరుమల కొండ కిటకిటలాడింది. సప్త వాహన సేవలను తిలకించిన భక్తజనం తన్మయులయ్యారు. వేకువజాము 5.30 గంటలకు వాహన మండపం నుంచి సూర్యప్రభ వాహనంలో విశేష అలంకరణతో మలయప్ప స్వామి బయలుదేరాడు. వాయువ్య మూలలో వేంచేసి సూర్యోదయం కోసం ఎదురు చూశాడు. సరిగ్గా 6.48 గంటలకు రవి కిరణాలు స్వామిని తాకాయి. ఆ క్షణం కోసమే గ్యాలరీల్లో ఎదురు చూసిన భక్తజనం గోవిందనామస్మరణలతో ఆ ప్రాంతం హోరెత్తింది. ఆ తర్వాత ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య చిన్నశేషవాహనం,11-12మధ్య గరుడవాహనం, మధ్యాహ్నం 1-2 మధ్య హనుమంతవాహనం నిర్వహించారు. మధ్యాహ్నం 2-3 మధ్య పుష్కరిణిలో చక్రస్నానం వైభవంగా జరిగింది. అంతకుముందు వరాహస్వామి ఆలయం వద్ద చక్రత్తాళ్వార్లకు పాలు, పెరుగు, నెయ్యి, తేనె, చందనంతో అర్చకులు అభిషేకం చేశారు. అధికారులతో పాటు భక్తులు పుష్కరిణిలో పవిత్రస్నానాలు ఆచరించారు. తిరిగి సాయంత్రం 4-5 మధ్య కల్పవృక్ష వాహనం, 6-7 మధ్య సర్వభూపాల వాహనం, రాత్రి 8 నుంచి 9 గంటల మధ్య చంద్రప్రభావాహనసేవలతో ఒక్క రోజు బ్రహ్మోత్సవాలు వేడుకగా ముగిశాయి.

మాడవీధులు కిటకిట

సోమవారం సాయంత్రం గ్యాలరీల్లోకి భక్తుల ప్రవేశం మొదలైంది. అర్ధరాత్రి ఉత్తరమాడవీధి పూర్తిస్థాయిలో నిండిపోగా, మంగళవారం వేకువజామునకు పడమర, దక్షణ, తూర్పు మాడవీధులు, శ్రీవారి ఆలయం ముందు భాగం భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఎండకు, చలికి ఇబ్బంది లేకుండా మాడవీధుల్లోని గ్యాలరీలపై షెడ్లు వేయడంతో ముందు రోజు సాయంత్రం నుంచీ మంగళవారం రాత్రి దాకా భక్తులు ఒక్కో వాహనాన్ని తిలకిస్తూ కూర్చుండిపోయారు. టీటీడీ అన్నప్రసాదాలు, తాగునీరు అందించడంతో ఇబ్బందిలేకుండా గడిపారు. రాంభగీచ అతిథిగృహాల వద్ద మాత్రం యాత్రికులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. అక్కడక్కడ గేట్లకు తాళాలు వేయడంతో అగచాట్లు పడ్డారు.

కంగారు పెట్టిన గొడుగు



చిన్నశేష వాహనంలో గొడుగు జారడం అధికారుల్లో కంగారు పుట్టించింది. వాహనమండపం, పుష్కరిణి మధ్యలో వాహనబేరర్లు వాహనాన్ని పైకి, కిందకు ఊపుతూ వేగంగా నడవడంతో ఉత్సవమూర్తికి ఎడమ వైపునున్న అర్చకుడి చేతి నుంచి గొడుగు కిందకు జారింది. అయితే వెంటనే అర్చకుడు అప్రమత్తమై గొడుగును పైకి ఎత్తి దాని స్థానంలో ఉంచడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

భక్తులందరూ సంతృప్తి వ్యక్తం చేశారు

రథసప్తమి సందర్భంగా టీటీడీ కల్పించిన సౌకర్యాలపై భక్తులందరూ సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదేవిధంగా రాబోవురోజుల్లో కూడా ఏర్పాట్లు చేయాలని కోరారు. గ్యాలరీల్లోకి స్వయంగా వెళ్లి ఆరా తీస్తే తమకు ఎలాంటి ఇబ్బందులు లేవని భక్తులు చెప్పారు. ఇంతమంచి ఏర్పాట్లు చేయడంతో పాటు అధికారులు, పోలీసులు, విజిలెన్స్, శ్రీవారిసేవకులు సమర్థంగా విధులు నిర్వహించారు. వారికి ప్రత్యేక ధన్యవాదాలు.

- బీఆర్ నాయుడు, టీటీడీ బోర్డు చైర్మన్

2.50 లక్షల మంది పాల్గొన్నారు

దాదాపు 2.50 లక్షల మంది భక్తులు పాల్గొని రథసప్తమి వాహన సేవలను వీక్షించారు. సోమవారం రాత్రికే దాదాపు 50 వేల మంది భక్తులు గ్యాలరీల్లోకి వచ్చారు. చాలా మంది ఏర్పాట్లపై మంచి ఫీడ్‌బ్యాక్ ఇచ్చారు. పకడ్బందీగా ఏర్పాట్లు చేయడంతో ఎలాంటి సమస్యలు రాలేదు. నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు అందిస్తున్నాం. మరుగుదొడ్ల ఏర్పాటుపై కూడా భక్తులు మంచి స్పందన ఇచ్చారు. రథసప్తమి విజయవంతం కావడం చాలా సంతోషంగా ఉంది.

- శ్యామలరావు, టీటీడీ ఈవో

ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో

నిందితుడికి ఏడాది జైలు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ జిల్లా మొదటి తరగతి జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎస్. శ్రీకాంత్ మంగళవారం తీర్పు చెప్పారు. తిరుపతి ఎర్రచందనం కోర్టు లైజన్ అధికారులు చంద్రశేఖరరాజు, రఘు తెలిపిన ప్రకారం.. డక్కిలి మండలం వెలికల్లుకు చెందిన మచ్చల గురునాథం 2012-13లో.. 18 ఎర్రచందనం దుంగలను తమిళనాడుకు తీసుకెళ్లడానికి కయ్యూరు చెరువులో దాచి ఉంచారు. ఈ విషయం తెలిసిన అటవీశాఖ అధికారులు ఆ దుంగలు స్వాధీనం చేసుకుని గురునాథంపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ శిరీష వాదనలు వినిపించారు. నేరారోపణ రుజువు కావడంతో నిందితుడికి ఏడాది జైలు, రూ.ఐదు వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

లా ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో 2024 అక్టోబరులో నిర్వహించిన ఎల్ఎల్ఎం రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయి. స్కూల్స్9, మనబడి వెబ్‌సైట్లలో ఈ ఫలితాల చూడాలని సీఈ దామ్లానాయక్ తెలిపారు.

ఎంపీడీవోకు రూ.మూడేసి వేలు

ఎవరెవరు ఇస్తున్నారు?

- అవినీతి ఆరోపణలపై డ్వామా ఏపీడీ విచారణ



ఏపీడీ వరప్రసాద్

పెళ్లకూరు, ఫిబ్రవరి 4, (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల బిల్లుల్లో ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి పెళ్లకూరు ఎంపీడీవో ప్రమీలారాణి నగదు వసూలు చేస్తున్నారన్నారంటూ వచ్చిన ఆరోపణలపై డ్వామా ఏపీడీ వరప్రసాఏడ్ విచారణ చేపట్టారు. ఎంపీడీవోపై అవినీతి ఆరోపణలు చేసిన టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, సర్పంచు గుంటపూడి పెంచలయ్య సమక్షంలో మంగళవారం మండల కార్యాలయంలో ప్రమీలారాణిని విచారించారు. ఆరోపణలకు సంబంధించిన ఆధారాలు చూపాలని మురళీకృష్ణారెడ్డిని ఏపీడీ కోరారు. అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్లను బహిరంగంగా విచారించారు. ఎంపీడీవోకు నెలకు రూ.3 వేలు చొప్పున ఎవరెవరు ఇస్తున్నారని ప్రశించగా, తాము ఇవ్వడంలేదని వారు చెప్పారు. విచారణాంశాలపై కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తానని ఏపీడీ చెప్పారు.

మూడోసారీ.. హరిత పాఠశాల

- నారాయణవనం బాలికోన్నత పాఠశాలకు జాతీయస్థాయిలో గుర్తింపు



ఢిల్లీలో ఉత్తమ హరిత పాఠశాల అవార్డును అందుకుంటున్న శ్యామలత

నారాయణవనం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలోని బాలికోన్నత పాఠశాల 2024-25 సంవత్సరానికిగాను మూడోసారి కూడా హరిత పాఠశాలగా ఎంపికై జాతీయ స్థాయిలో గుర్తింపు పొందినట్టు ప్రధానోపాధ్యాయురాలు శశికళ తెలిపారు. ఢిల్లీలో మంగళవారం జరిగిన నేషనల్ గ్రీన్ కోర్, సైన్స్ అండ్ ఎన్విరాన్మెంట్ ఆధ్వర్యంలో ఉత్తమ హరిత పాఠశాల అవార్డును సీఎస్ఈ డైరెక్టర్ జనరల్ సునీత నరేన్ చేతుల మీదుగా పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు, ఎన్‌జీసీ కోఆర్డినేటర్ కె.వి.శ్యామలత అందుకున్నారు. పాఠశాలలో వ్యర్థాల నిర్వహణ, ఇంకుడు గుంత ద్వారా వర్షం నీటి నిల్వ, విద్యార్థుల పుట్టిన రోజు సందర్భంగా మొక్కలు నాటించడం, పచ్చదనం పెంచడం, విద్యుత్ ఆదా వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని హరిత పాఠశాల అవార్డు ఇచ్చారు. ఏపీ ఎన్‌జీసీ డైరెక్టర్ పి.స్రవంతి, డీఈవో కేవీఎన్ కుమార్, డీవైఈవో ప్రభాకర్ రాజు, ఏపీ రాష్ట్ర కోఆర్డినేటర్ నీలకంఠ తదితరులు ఉపాధ్యాయులను అభినందించారు.

బందోబస్తు సిబ్బందికి ధన్యవాదాలు

తిరుమల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి వేడుకల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా విధులు నిర్వహించిన పోలీసు అధికారులు, సిబ్బందికి అనంతపురం రేంజ్ డీఐజీ షేమోషీ, ఎస్పీ హర్షవర్ధనరాజు శుక్రవారం రాత్రి ఓ ప్రకటన ద్వారా ధన్యవాదాలు తెలిపారు. మొత్తం 1,400 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామని, కట్టుదిట్టమైన భద్రత నడుమ వాహనసేవలు జరిగాయని పేర్కొన్నారు. యాంటీ సబటేజ్ చెక్, ఫ్రిస్కింగ్, క్రౌడ్ కంట్రోల్, ట్రాఫిక్ నియంత్రణ వంటి చర్యలు చేపట్టామన్నారు. విజిలెన్స్‌తో సమన్వయం చేసుకుని చిన్నఘటన కూడా లేకుండా చర్యలు చేపట్టామన్నారు.

రెండు బస్సుల ఢీ: ఏడుగురికి గాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

చిల్లకూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదనం టోల్ ప్లాజా సమీపంలో మంగళవారం రెండు బస్సులు ఢీకొన్న ఘటనలో ఏడుగురికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... తిరుపతి నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఓ ప్రైవేటు ట్రావెల్ బస్సును అదే మార్గంలో వెళుతున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొంది. దీంతో ప్రైవేటు బస్సులో ప్రయాణిస్తున్న తెలంగాణ రాష్ట్రం జనగాం జిల్లా హైతమడపల్లి గ్రామానికి చెందిన యగయ్య, కళమ్మ, శివకుమార్, వీరాస్వామి, జయకుమార్, హేమంత్‌కుమార్‌తో పాటు నెల్లూరు జిల్లా రాపూరు మండలం వేపినామి గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ ఆనంద్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇరకం గ్రామస్తులను ఆదుకోండి



కలెక్టర్ వెంకటేశ్వర్‌కు అర్జీ సమర్పిస్తున్న టీడీపీ నేత బొమ్మన శ్రీధర్

తడ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఇరకం గ్రామస్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వారిని ఆదుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మన శ్రీధర్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కోరారు. మంగళవారం తిరుపతిలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఇరకం నుంచి పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల కోసం కొత్త పడవ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ఇరకం, భీములవారిపాళెంలో నాలుగుచోట్ల, పులికాట్ సరస్సు వద్ద పడవ ప్లాట్ పామ్‌లను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన కలెక్టర్ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జయపాల్, పరమన్, మణికఠన్ పాల్గొన్నారు.

చెంగాళమ్మ హుండీ ఆదాయం రూ.53 లక్షలు



హుండీ ఆదాయ లెక్కింపును పర్యవేక్షిస్తున్న సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): చెంగాళమ్మ ఆలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. 105 రోజులకు గాను రూ.53,23,998 ఆదాయం వచ్చిందని దేవదాయశాఖ సహాయ కమిషన్ బి.ప్రసన్నలక్ష్మి తెలిపారు. అలాగే విదేశీ కరెన్సీ యుఎస్ఏ డాలర్లు 31, సింగపూర్ డాలర్లు 4, సౌదీ రియాల్స్ 50, యూఏఈ దిరహమ్స్ 5, ఇంగ్లాండ్ పౌండ్స్ 10, మలేషియా రింగట్స్ 12, ఆస్ట్రేలియా డాలర్లు 50, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఒమన్ 1 భక్తులు కానుకలుగా సమర్పించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస బాబు, ఆలయ సిబ్బంది కామేశ్వర రావు, మెప్మా సిబ్బంది, విశ్రాంతి బ్యాంక్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కోటలో నేడు ఆర్టీసీ బస్సుల ప్రారంభం

తిరుపతి(ఆర్టీసీ), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని వాకాడు డిపోకు చెందిన పది ఆర్టీసీ నూతన బస్సులను బుధవారం ప్రారంభించనున్నారు. కిలోమీటర్ల కాలపరిమితి ముగిసిన బస్సుల స్థానంలో కొత్త బస్సులను నడపనున్నారు. ఈ మేరకు వాకాడు డిపో పరిధిలోని కోట బస్టాండు నుంచి విజయవాడకు 1, ప్రొద్దుటూరుకు 1, కడపకు 3, తిరుపతికి 3, నెల్లూరుకు 2 బస్సులు తిరగనున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, డీపీటీవో జి.నరసింహులు హాజరుకానున్నారు.

మామిడి కాలువ సర్వే

నాయుడుపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండంలోని మేనకూరు గ్రామంలో ఉన్న మామిడి కాలువను కొంతమంది ఆక్రమించి నిర్మాణ పనులు చేపడుతున్నట్లు గ్రామస్తులు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఇరిగేషన్ డీఈ వీరాస్వామి, ఏఈ శ్రీనివాసులు, సర్వేయర్ చరణ్, ఆర్ఐ సాయితేజ మామిడికాలువ ప్రాంతాన్ని సర్వేచేసి కొలతలు తీశారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు.

ఆర్సీ.బి3/ఇ-37222/2025 తేది : 22-01-2025

శ్రీయుత జిల్లా కలెక్టర్ తిరుపతి వారి కార్యవర్తనములు
ప్రస్తుతము:: శ్రీ డాక్టర్ వెంకటేశ్వర్ యస్. ఐ.ఏ.యస్.
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

ఫారం నెం.6 (ఎ)

Form No. VI

Under Section -11(1) of the Act 30 of 2013 Read with Sub-rule (1) of Rule 19

ప్రాథమిక ప్రకటన

క్రింది షెడ్యూలులో నిర్దిష్ట పరచిన దక్కిలి మండలములోని పెదయాచసముద్రం గ్రామములోని భూమిని ప్రజాహిత కార్యక్రమాలకు అనగా ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రీయల్ ఇన్ ఫ్రాష్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ) ద్వారా " కండలేరు నుంచి దక్షిణ ప్రాంతములోని పారిశ్రామిక క్లస్టర్స్"కు నీటిని తరలించేందుకు (VCIC ప్రాజెక్ట్ పైప్‌లైన్)" నిర్మాణము కొరకు భూమి కావలెనని జిల్లా కలెక్టరు, తిరుపతి వారు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున 2013వ సంవత్సరము 30వ చట్టము వలన భూసేకరణలో న్యాయమైన నష్టపరిహారము, పారదర్శకత, పునరావాసం మరియు పునఃస్థాపనల చట్టం 2013లో సెక్షన్ 11వ విభాగపు 1వ ఉప విభాగంలోని నిబంధనల మేరకు ఇందుకు సంబంధించిన యావన్మందికి తెలియజేయు నిమిత్తం ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

పై చట్టంలోని సెక్షన్ 10(ఎ) మరియు రూలు (4) ననుసరించి ఈ భూసేకరణ ప్రక్రియలో సెక్షన్ 4 మేరకు సామాజిక ప్రభావం అంచనా అధ్యయనం మినహాయించడమైనదని జిల్లా కలెక్టరు, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు ఆదేశించడమైనది.

జిల్లా కలెక్టరు, తిరుపతి వారు పైన పేర్కొనిన చట్టంలోని 12వ సెక్షన్ ద్వారా లభ్యమైన అధికారాలను ప్రత్యేక ఉప కలెక్టరు (భూ.సే), ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రీయల్ ఇన్‌ఫ్రాష్ట్రక్చర్ కార్పోరేషన్ (ఏపీఐఐసీ), తిరుపతి వారికి, వారి సిబ్బందికి మరియు పనివారలకు అధికారము ఇవ్వబడినది.

పై చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేది నుండి జిల్లా కలెక్టరు/(భూసేకరణ), ప్రత్యేక ఉప కలెక్టరు (భూసేకరణ) ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రీయల్ ఇన్‌ఫ్రాష్ట్రక్చర్ కార్పోరేషన్ (ఏపీఐఐసీ), తిరుపతి వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి కూడా ప్రకటనలో తెలిపిన భూమిని ఎటువంటి క్రయ విక్రయాలు, తాకట్టు లేదా ఏ విధమైన లావాదేవీలు జరపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలోని సెక్షన్ 15 ననుసరించి భూసేకరణ పై ఏ విధమైన అభ్యంతరములు / ఆక్షేపణలు ఉన్న యెడల సంబంధిత వ్యక్తి/వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురించబడిన తేది నుండి 60 (అరువది) దినములలోగా భూసేకరణ అధికారి, ప్రత్యేక ఉప కలెక్టరు (భూ.సే), ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రీయల్ ఇన్‌ఫ్రాష్ట్రక్చర్ కార్పోరేషన్ (ఏపీఐఐసీ), తిరుపతి వారి ఎదుట ఆక్షేపణలను దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

మండలం : దక్కిలి — గ్రామం : పెదయాచసముద్రం

వరుస సంఖ్య	సర్వే నెం./ సబ్ నెం.	సర్వే నెం యొక్క విస్తీర్ణం	భూసేకరణ కొరకు అవసరమయ్యే విస్తీర్ణం (ఎకరాలలో)	ఆసక్తి కల్గిన వ్యక్తి పేరు మరియు చిరునామా	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు, కట్టడాలు, వగైరా వివరములు
1.	65-1	0.80	0.03	1.తంబిశెట్టి అంకయ్య తండ్రి వెంకటస్వామి 2. తంబిశెట్టి రామయ్య తండ్రి వెంకటయ్య 3.తంబిశెట్టి రత్నం తండ్రి వెంకటస్వామి 4.తంబిశెట్టి వెంకటసుబ్బయ్య తండ్రి వెంకటస్వామి 5.తంబిశెట్టి వెంకటయ్య తండ్రి వెంకటస్వామి	66	73	72	61, 64	-
2.	66-1	1.68	0.05	1.బండారు పెంచలరత్నం తండ్రి నరసింహులు 2. బండారు అశోక్ తండ్రి నరసింహులు 3. తంబిశెట్టి యల్లయ్య	67	65	71	61	-
3.	67-1	0.90	0.03	1.కొండ్రెడ్డి రాజారెడ్డి తండ్రి పుల్లారెడ్డి 2.కొండ్రెడ్డి కృష్ణారెడ్డి తండ్రి పుల్లారెడ్డి	68, 70	66	71	60, 61	-
4.	67-4	1.73	0.01	1.కొండ్రెడ్డి రాజారెడ్డి తండ్రి పుల్లారెడ్డి 2.కొండ్రెడ్డి చంద్రరెడ్డి తండ్రి కృష్ణారెడ్డి	68, 70	66	71	60, 61	-
5.	67-5	0.11	0.01	1.కొండ్రెడ్డి కృష్ణారెడ్డి తండ్రి పుల్లారెడ్డి	68, 70	66	71	60, 61	-
6.	67-6	2.04	0.03	1.కొండ్రెడ్డి రాజారెడ్డి తండ్రి పుల్లారెడ్డి 2.కొండ్రెడ్డి చంద్రరెడ్డి తండ్రి కృష్ణారెడ్డి	68, 70	66	71	60, 61	-
7.	68-3	0.50	0.01	1.కొండ్రెడ్డి రాజారెడ్డి తండ్రి పుల్లారెడ్డి 2.వెలికింటి శివశంకర్ తండ్రి తిరుపాలయ్య	వి.నెం. 30, పలుగోడు	67	70, 69	60	-
8.	68-6	0.17	0.01	వెలికింటి శివశంకర్ తండ్రి తిరుపాలయ్య	వి.నెం. 30, పలుగోడు	67	70, 69	60	-
9.	68-7	0.19	0.01	వెలికింటి చలపతి తండ్రి తిరుపాలయ్య	వి.నెం. 30, పలుగోడు	67	70, 69	60	-
10.	68-8	0.82	0.03	1.వెలికింటి చలపతి తండ్రి తిరుపాలయ్య 2.వెలికింటి శివశంకర్ తండ్రి తిరుపాలయ్య	వి.నెం. 30, పలుగోడు	67	70, 69	60	-
11.	65-2	0.14	0.01	1. తంబిశెట్టి వెంకటసుబ్బయ్య తండ్రి వెంకటస్వామి 2. తంబిశెట్టి వెంకటయ్య తండ్రి వెంకటస్వామి 3. తంబిశెట్టి వెంకటయ్య	66	73	72	61, 64	-
12.	65-9	0.48	0.03	1. తంబిశెట్టి రామయ్య తండ్రి వెంకటయ్య 2. తంబిశెట్టి వెంకటయ్య తండ్రి వెంకటస్వామి 3. తంబిశెట్టి వెంకటపతి తండ్రి వెంకటయ్య	66	73	72	61, 64	-
	Total		0.26						

సం/- డా.వెంకటేశ్వర్.యస్., IAS., జిల్లా కలెక్టర్, తిరుపతి

అన్నదానం

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక గమళ్లపాళెంలోని నిరాశ్రయుల కేంద్రంలో మంగళవారం శ్రీకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం చేశారు.

నేడు ఓజిలి మండల మీట్

ఓజిలి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అరుణమ్మ అధ్యక్షతన బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచులు, అన్నిశాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

మినీలారీ బోల్తా డ్రైవర్ మృతి

తిరుచానూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):దామినేడు వద్ద రహదారిలో మినీలారీ డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. ఎస్ఐ అరుణ కథనం వెంకటగిరి మండలం ఈటిపెల్లవారిపల్లెకు చెందిన మహేష్(27), మరో వ్యక్తి ప్రవీష్ కర్ణాటక నుంచి టమోటాలోడుతో వెంకటగిరికి బయలుదేరారు. మంగళవారం వేకువజామున దామినేడు వద్ద వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీ కొట్టింది. దీంతో డ్రైవర్ మహేష్ వెంటనే మృతి చెందాడు. పోలీసులు చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. మహేష్ మృతదేహాన్ని రుయా మార్చురీకి తరలించారు. గాయపడిన ప్రవీష్‌ను ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అరుణ తెలిపారు.

కార్మికుల హక్కులను కాలరాస్తే ఉద్యమం

కోట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను యాజమాన్యాలు కాలరాస్తున్నాయని, ఇదే పరిస్థితి కొనసాగితే ఉద్యమాలే శరణ్యమని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. కోటలోని షాదీమంజిల్‌లో మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నాన్ టీచింగ్ ఉద్యోగులకు అనుకూలంగా లేబర్ కోర్టు ఇచ్చిన తీర్పును కళాశాల యాజమాన్యం వెంటనే అమలు పరచాలన్నారు. సమావేశంలో ప్రభాకర్, కాలేషా, సీపీఐ నేతలు శశికుమార్, చంద్రయ్య, ఆదెయ్య, బాబు రావు, భూపతి, అంకమరాజు తదితరులు పాల్గొన్నారు.



మంగళవారం ఉదయం 10.40గంటలకు కాదలూరు, 10.50కి కొండూరు, 11.30కి అండగుండాల సచివాలయాల్లో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

సచివాలయాల్లో సిబ్బంది ఏరీ?

- కార్యాలయాల్లో కనిపించని సిబ్బంది
- ఫీల్డ్ వర్క్ పేరుతో డుమ్మా
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ శూన్యం

తడ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సేవలను ప్రజలకు సులభంగా అందాలనే ఉద్దేశంతో ఏర్పాటైన సచివాలయాలు నిద్రావస్థలో ఉన్నాయి. సచివాలయాల సిబ్బంది కార్యాలయాల ముఖం కూడా చూడడంలేదు. అడిగితే చేస్తే ఫీల్డ్‌వర్క్‌లో ఉన్నామని చెబుతున్నారు. గ్రామాల్లో విచారిస్తే సచివాలయ సిబ్బంది ఎవరూ రాలేదని స్థానికులు అంటున్నారు. ఇది తడ మండలంలోని సచివాలయాల పరిస్థితి. మండలంలో మొత్తం 18 పంచాయతీలకుగాను 16గ్రామ సచివాలయాలు ఉన్నాయి. ఆయా కార్యాలయాల్లో సుమారు 170 మంది ఉద్యోగులు ఉండాల్సి ఉండగా, అధికారుల లెక్కల ప్రకారం ప్రస్తుతం 115మంది మాత్ర మే విధుల్లో ఉన్నారు. వారన్నా సక్రమంగా పనిచేస్తున్నారా అంటే అదీ లేదు. సచివాలయాల్లో ఎప్పుడు చూసినా ఖాళీగా దర్శనమిస్తున్నాయి. మంగళవారం మండలంలోని పలు సచివాయాలను ఆంధ్రజ్యోతి పరిశీలించగా కాదలూరులో నలుగురు, కొండూరులో ముగ్గురు, గ్రద్దగుంటలో నలుగురు, అండగుండాలలో నలుగురు, తడలో నలుగురు చొప్పున విధుల్లో ఉన్నారు. మిగిలిన సిబ్బంది ఏమయ్యారని విచారిస్తే ఈకేవైసీ, భూముల సర్వే, ఎంఎస్ఎంఈ వంటి ఏడు సర్వేలు చేసేందుకు ఆయా గ్రామాలకు వెళ్లారని సమాధానం చెప్పారు. ఆయా గ్రామాల్లో ఆరాతీస్తే సచివాయ సిబ్బంది ఎవరూ రాలేదని తెలిసింది. దీనిపై డీఎల్‌డీవో అధికారి జాలిరెడ్డి, ఎంపీడీవో విజయకుమార్‌ను వివరణ కొరగా సచివాలయాలు ఉదయం 10.30నుంచి 5గంటల వరకు పని చేస్తాయని చెప్పడం గమనార్హం. అయితే ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతోనే సచివాలయాల్లో సిబ్బంది విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

కోడిపందేలు, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు

ఓజిలి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎక్కడైనా కోడి పందేలు, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ స్వప్న అన్నారు. మంగళవారం ఆమె మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. కల్లు, మద్యం వంటి మత్తు పదార్థాలను బహిరంగ ప్రదేశాల్లో సేవించరాదని సూచించారు. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని కోరారు.

దుకాణ సముదాయాలకు అద్దె చెల్లించండి

నాయుడుపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపాలిటీకి సంబంధించిన దుకాణ సముదాయాలకు అద్దె త్వరితగతిన చెల్లించాలని కమిషనర్ ఫజులుల్లా కోరారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దుకాణాల అద్దె చెల్లింపులకు సంబంధించి రూ.90 లక్షల వరకు బకాయిలు ఉన్నాయని, త్వరితగతిన చెల్లించాలని నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. అద్దె చెల్లించని దుకాణాలకు తాళాలు వేస్తామని హెచ్చరించారు. అదే విధంగా మున్సిపాలిటీ పరిధిలో 3,500కు పైబడి అనధికారిక కొళాయి కనెక్షన్లు కలిగి ఉండటంతో వాటిని క్రమబద్ధీకరించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. కొంతమంది రెసిడెన్షియల్ కింద ప్లాన్ అప్రూవల్ తీసుకొని కమర్షియల్ నిర్మాణ పనులు చేపడుతున్నారని, వారందరికీ నోటీసులు జారీ చేసినట్లు కమిషనర్ తెలిపారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు



సూర్యప్రభ వాహనంలో ఊరేగుతున్న పాండురంగ స్వామి

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని పాండురంగ స్వామి ఆలయం, మన్నారుపోలూరు అలఘుమల్లారి కృష్ణస్వామి ఆలయాల్లో రథసప్తమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. పాండురంగ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సూర్యప్రభ వాహనంపై స్వామివారిని కొలువుదీర్చి పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. అలాగే మన్నారుపోలూరు ఆలయంలో స్వామివారిని సూర్యప్రభ వాహనం ఊరేగించారు.

గూడూరు: పట్టణంలోని అళగనాధస్వామి ఆలయంలో స్వామి వారిని సూర్యప్రభ వాహనంపై ఉంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామోత్సవం జరిపారు. అలాగే సాయిసత్సంగ నిలయంలోని విజయ దుర్గాదేవి ఉపపీఠంలో నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో సూర్యభగవానుడికి హోమ పూజలు చేశారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కోట: మండల పరిధిలోని గూడలిలో గల శ్రీదేవి, భూదేవి సమేత జనార్దనస్వామి ఆలయంలో ప్రధానార్చకుడు ఉదయగిరి ఆదిశేషాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అదేవిధంగా శ్రీలక్ష్మమ్మకాలనీలోని సాయిబాబా ఆలయంలో, చిట్టేడు, నెల్లూరుపల్లి కొత్తపాళెం, గోవిందపల్లి గ్రామాల్లో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో రథసప్తమి వేడుకలు జరిగాయి. విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో రథసప్తమి వేడుకలు జరిగాయి. కళాశాలలో యోగాక్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థుల చేత యోగాసనాలు, సూర్య నమస్కారాలు చేయించారు. వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, అసిస్టెంట్ పీడీలు శోభారాణి, రామ్‌కుమార్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చంద్రమౌళి నగర్‌లో ఉన్న సరస్వతీ మహావిద్యాలయ విద్యార్థులు మంగళవారం జాతీయ క్యాన్సర్ డే సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కరస్పాండెంట్ విజయప్రియ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ కవర్లను వాడకూడదని విద్యార్థులు నినాదాలు చేస్తూ పాఠశాల నుంచి పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. హోటళ్ల వద్దకెళ్లి ప్లాస్టిక్ కవర్లు వాడటం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రియ, మౌళిక, సుప్రజ, ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

'థ్యాంక్యూ మోదీ' పోస్టుకార్డుల ఉద్యమం

గూడూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అందరికీ సానుకూలమైన బడ్జెట్‌ను రూపొందించిన ప్రధాని నరేంద్రమోదీకి కృతజ్ఞతలు తెలుపుతూ 'థ్యాంక్యూ మోదీ' పోస్టుకార్డుల ఉద్యమాన్ని చేపట్టామని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతి నిధి మనోజ్‌కుమార్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో బీజేవైఎం ఆధ్వర్యంలో మోదీకి ధన్యవాదాలు తెలుపుతూ పోస్టుకార్డులను సేకరించారు. కార్యక్రమంలో శివశంకర్, ప్రణయ్, వాసు, కిరణ్, నవీన్, ప్రదీప్, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేటలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు హాల్ట్

పెరంబూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం - సికింద్రాబాద్ - రామనాథపురం ఎక్స్‌ప్రెస్ రైళ్లకు నాయుడుపేటలో అదనపు హాల్ట్ కల్పించినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. సికింద్రాబాద్ - రామనాథపురం ఎక్స్‌ప్రెస్(07695) ఈనెల 5నుంచి రోజూ ఉదయం 8.18 గంటలకు నాయుడుపేటకు చేరుకొని 8.20 గంటలకు బయల్దేరుతుంది. అలాగే రామనాథపురం - సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్(07696) ఈనెల 7నుంచి రోజూ అర్ధరాత్రి 12.03 గంటలకు చేరుకొని 12.05 గంటలకు బయల్దేరి వెళ్లనుంది.

టీడీపీతోనే నాయీబ్రాహ్మణులకు గుర్తింపు



సమావేశంలో మాట్లాడుతున్న రుద్రకోట సదాశివం

గూడూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే నాయీబ్రాహ్మణులకు తగిన గుర్తింపు లభించిందని నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోట సదాశివం అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాయీబ్రాహ్మణుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా ఏపీలో 1989లో స్వర్గీయ నందమూరి తారక రామారావు నాయీబ్రాహ్మణ ఫెడరేషన్‌ను ప్రారంభించారన్నారు. పేదల అభ్యున్నతికి పాటు పడుతున్న సీఎం చంద్రబాబు నాయుడు నాయీబ్రాహ్మణ ఫెడరేషన్‌ను కార్పొరేషన్‌గా మార్చి 1.33 లక్షల మందికి రుణాలు అందించడం జరిగిందన్నారు. దేవాలయాల్లో పనిచేసే నాయీబ్రాహ్మణులకు వేతనాన్ని రూ.10వేల నుంచి రూ.15వేలకు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానికే చెందుతుందన్నారు. టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యం చేసిన 56 కార్పొరేషన్‌లకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పూర్వవైభవం తీసుకువచ్చిందన్నారు. బీసీల అభ్యున్నతి కోసం పాటుపడేది టీడీపీనేనని అన్నారు. అనంతరం గమళ్లపాళెంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్ రహీం, ఇశ్రాయిల్‌కుమార్, వెంకటేశ్వర్లురాజు, పిళ్లెళ్ల శ్రీనివాసులు, గురునాథం, భాస్కర్, సుబ్రమణ్యం, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 37 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కంపెనీ ప్రతినిధులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన జాబ్ మేళా నిర్వహించారు. శ్రీసిటీ పారిశ్రామికవాడలో ఉన్న పలు పరిశ్రమల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 72 మంది హాజరుకాగా 37 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసి నియామక పత్రాలు అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ వెంకటశర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ కో ఆర్డినేటర్స్ హరికృష్ణ, సునీల్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ విక్టోరియా రాణి, జేకేసీ కో ఆర్డినేటర్స్ సుబ్రహ్మణ్యం శాస్త్రి, జీకే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ షరీనా

గూడూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగివుండాలని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా అన్నారు. మంగళవారం స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రపంచ క్యాన్సర్ డే సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సరైన సమయంలో క్యాన్సర్ లక్షణాలను గుర్తించడం ద్వారా నయం చేసుకునే వీలుంటుందన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంబించడం ద్వారా క్యాన్సర్‌ను నివారించుకోవచ్చునన్నారు. క్రమం తప్పకుండా వ్యాయమం చేయడం, పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. యువత మత్తుపదార్థాలకు, చెడు అలవాట్లుకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవిప్రసాద్, భాస్కర్, స్వర్ణ, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీని సందర్శించిన జపాన్ ప్రతినిధుల బృందం



జపాన్ ప్రతినిధుల బృందానికి స్వాగతం పలుకుతున్న శ్రీసిటీ ఎండీ

శ్రీసిటీ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జపాన్ - ఎహైమ్ రాష్ట్రానికి చెందిన 25మంది ఉన్నతస్థాయి ప్రతినిధుల బృందం మంగళవారం శ్రీసిటీని సందర్శించింది. గవర్నర్ టోకిహిరో నకమురా నేతృత్వంలో విచ్చేసిన బృందానికి శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ ప్రత్యేకతలు వివిధ రంగాలకు చెందిన అంతర్జాతీయ పరిశ్రమల ఉనికి గురించి వివరించారు. ఎహైమ్‌కు చెందిన వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తుల తయారీ పరిశ్రమ యూనిచార్మ్‌తో పాటు 30కు పైగా జపాన్‌కు చెందిన పరిశ్రమల ఏర్పాటుతో దేశంలోనే రెండవ అతిపెద్ద జపనీస్ పరిశ్రమల కేంద్రంగా శ్రీసిటీ అవతరించిందని చెప్పారు. గవర్నర్ టోకిహిరో నకమురా అడిగిన ఒక ప్రశ్నకు సన్నారెడ్డి సమాధానమిస్తూ... ఆంధ్రప్రదేశ్ పెట్టుబడిదారుల అనుకూల విధానాలను వివరించారు. వేగవంతమైన అనుమతులు, ప్రోత్సాహకాలు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తదితర అంశాల గురించి వివరించారు. శ్రీసిటీలో పరిశ్రమల స్థాపనతో బలమైన ఉనికిని చాటాలంటూ ఎహైమ్ రాష్ట్ర పారిశ్రామికవేత్తలకు ఆయన ఆహ్వానించారు. ప్రతినిధుల బృందంలో ఎహైమ్ అసెంబ్లీ చైర్మన్ హీరోమాసా మియాకేతో పాటు బ్యాంకింగ్ రంగం, వివిధ వ్యాపార సంస్థల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.